ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాఖీ వేడుకలు



నవతెలంగాణ-మట్టెవాడ

రక్షాబంధన్ సందర్భంగా గురువారం వరంగల్ శివనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాఖీవేడుకలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, ఎస్‌హెచ్‌జీ సంఘాలమహిళలు,పార్టీ అనుబంధ సంఘాలు, ఆర్పీలు, నియోజకవర్గంలోని మహిళ లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు రాఖీలు కట్టాగ ఎమ్మెల్యే వారికి నూతన వస్త్రాలు బహుకరించారు. పలువురు కార్పొరేటర్లకు,నాయకులకు ఎమ్మెల్యే సతీమణి నన్నపునేని వాణి రాఖీకట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీక రాఖీపౌర్ణమి అన్నారు. తనపై ప్రేమతో రాఖీలు కట్టిన సోదరిణిలకు శుభాకాంక్షలు,కతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కు రాఖీ కట్టిన వారిలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్, కార్పొరేటర్లు కావేటి కవిత, భోగి సువర్ణ, ముష్కమల్ల అరుణ, ఆకుతోట తేజస్విని, మాజీ కార్పొరేటర్ కేడళ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, పెద్ది చిత్రపటాలకు క్షీరాభిషేకం



నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని వెంకటపాలెం చెరువుకట్టపై నుండి దస్తగిరిపల్లె, ముచింపుల వెళ్లే దారిని బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిల చిత్రపటాలకు ప్రజలు పాలాభిషేకం చేశారు. రూ.1.01 కోట్లతో రోడ్డు నిర్మాణానికి జీవోనెంబర్ 396 ద్వారా 2.4 కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి నిధులను విడుదల చేయగా గురువారం ఎంపీపీ ఊడుగుల సునీత ప్రవీణ్‌గౌడ్ హర్షంవ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి పల్లె సర్పంచ్ పెండ్యాల శ్రీలత సుధాకర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు బాషబోయిన రాజు, కృష్ణ, కుమారస్వామి, నరస య్య, తిరుపతి, రాజు, మొగిలి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో కొన'సాగు'తున్న అసమ్మతి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థులను ప్రకటించినా పలు నియోజకవర్గాల్లో పార్టీలో అసమ్మతి కొనసాగుతూనే వుంది. స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల నియోజకవర్గాల్లో పార్టీలో అసమ్మతి చిచ్చు చల్లారడం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పార్టీ అభ్యర్థిగా కడియం శ్రీహరిని ప్రకటించాక, ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అసంతృప్తిని వ్యక్తంచేస్తూనే వున్నారు. పార్టీ టికెట్ తనకే వస్తుందని ఆయన నేటికీ ఆశాభావంతో వున్నారు. పరకాలలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతివర్గం కార్యక్రమాలను నిర్వహిస్తూనే వుంది. ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటుచేసి ఉద్యమకారులకే పార్టీ టికెట్‌ఇవ్వాలంటూ డిమాండ్‌చేయడం గమనార్హం. ములుగు నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థిగా బడే నాగజ్యోతిని ప్రకటించాక, మాజీ మంత్రి చందూలాల్ తనయుడు ప్రహ్లాద్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరే ప్రయత్నంలో వున్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను బీఆర్ఎస్ 11నియోజకవర్గాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. కేవలం జనగామ నియోజకవర్గంలోనే అభ్యర్థిని ప్రకటించాల్సివుంది. బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించినా పార్టీలో అసమ్మతి చిచ్చుచల్లారడం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల నియోజకవర్గాలతోపాటు జనగామ నియోజకవర్గంలో ఎవరికివారే పార్టీటికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జనగామ పార్టీ టికెట్‌ను పెండింగ్‌లో పెట్టడంతో అక్కడ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్రఅధ్యక్షులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికీ ఇక్కడ టికెట్ విషయంలో తీవ్రంగా పోటీ వుంది. ఒకానొక దశలో 'పల్లా'ను వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి,ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వర్గాలు ఒకటయ్యాయి. జనగామ నియోజకవర్గంలో బిఆర్ఎస్ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి.

'తాటికొండ' పయనం ఎటు..?

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు పార్టీ టికెట్ దక్కకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. తొలుత సీఎం కేసీఆర్ హామీనిచ్చారని, పార్టీలో కొనసాగనున్నట్లు ప్రకటించిన 'తాటికొండ' మాటల్లో తేడావచ్చినట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ, బీఆర్ఎస్ టికెట్‌ను 'కడియం'కు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. నియోజకవర్గంలో మాదిగ సామాజికవర్గం అధికంగా వుండగా 'తాటికొండ'కు పార్టీ టికెట్‌ను తిరస్కరించడాన్ని తప్పుపట్టారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకే ఇవ్వాలే తప్పా 'కడియం'కు పార్టీటికెట్ ఇవ్వడం సరికాదన్నారు. ఈ క్రమంలో 'తాటికొండ' సీఎం కేసీఆర్ తన నిర్ణయాన్ని మార్చుకుంటారని ఆశిస్తున్నారు.

అది జరగని పక్షంలో పార్టీ మారే అవకాశాలు కూడా లేకపోలేదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఏదేమైనా ఇప్పటి వరకు 'తాటికొండ', 'కడియం'ల మధ్య సయోధ్య కుదర్చకపోవడం గమనార్హం. దీంతో ఎవరిస్థాయిలో వారు చేస్తున్న వ్యాఖ్యలు అసంతృప్తిని పెంచుతున్నాయి.

ఉద్యమకారుల లొల్లి..

పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మార్చాలని నియోజకవర్గంలో అసమ్మతి వర్గం డిమాండ్ చేస్తుంది. పార్టీ టికెట్ ఖరారు చేయక ముందునుండే ఉద్యమకారుడైన నాగుర్ల వెంకటేశ్వర్లుకు పార్టీ టికెట్‌ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న విషయం విధితమే. 'చల్లా'కు పార్టీ టికెట్ ఖరారయ్యాక కూడా తాజాగా పరకాలలో ఉద్యమకారులు సమావేశం ఏర్పాటు చేసి మరీ పార్టీ టికెట్‌ను 'నాగుర్ల'కు ఇవ్వాలని డిమాండ్ చేయడం గమనార్హం. ఆత్మకూరు మండలంలో 'నాగుర్ల' అనుచరులు ఆందోళన చేయడంతో వారిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన విషయం విధితమే. పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, నాగుర్ల వెంకటేశ్వర్లు మధ్య సయోధ్య కుదుర్చాల్సి వుంది. పార్టీ నాయకత్వం ఇంకా ఈ దిశగా అడుగులు వేయకపోవడంతో పలు నియోజకవర్గాల్లో అసమ్మతి కార్యక్రమాలు నేటికీ కొనసాగుతున్నాయి. వరంగల్‌తూర్పుతోపాటు మహబూబాబాద్ నియోజకవర్గంలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేల అభ్యర్థిత్వాలను వ్యతిరేకిస్తున్న కీలక నేతలున్నారు. ఇదిలావుంటే తొలి జాబితాలోనే ములుగు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా జడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని సీఎం ప్రకటించారు. గతంలో ఈ నియోజకవర్గం నుండి అజ్మీరా చందూలాల్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా వ్యవహరించారు. అనారోగ్య కారణాలతో మృతిచెందిన చందూలాల్ పెద్ద కుమారుడు ప్రహ్లాద్ ఇక్కడ బీఆర్ఎస్ టికెట్‌నాశించారు. పార్టీ నేతల వ్యవహార్శైలితో ఇప్పటి వరకు పార్టీకి దూరంగా వుండగా, తాజాగా పార్టీ టికెట్‌ను బడేనాగజ్యోతికి ఖరారు చేయడంతో ప్రహ్లాద్ బీఆర్ఎస్‌ను వీడడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. బీఆర్ఎస్ పెద్దఎత్తున అభ్యర్థులను ప్రకటించినా, ఆయానియోజకవర్గాల్లో వున్న అసమ్మతిని సద్దుమనిగేలా చేయడానికి కార్యచరణ ప్రారంభించలేదు. దీంతో పలు నియోజకవర్గాల్లో నేటికీ అసమ్మతి కార్యక్రమాలు కొనసాగుతూనే వున్నాయి.

వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు

జీడబ్ల్యుఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ బస్ స్టేషన్ ను అధునాతనంగా నిర్మించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని కుడా వైస్ ఛైర్మన్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కుడా, ఆర్టీసీ అధికారులతో కలసి వరంగల్ బస్ స్టేషన్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆధునిక విదానాలు, హంగులు, ప్రయాణికులకు వసతి, సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ వరంగల్ బస్ టర్మినల్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ప్రస్తుతమున్న బస్ స్టేషన్కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బస్ షెల్టర్లకు వెంటనే మార్చి బస్సుల రాకపోకలు నిర్వహించుకోవాలని ఆర్టీసీ ఆర్ ఎం ను సూచించారు. మార్చిన వెంటనే పాత భవనాన్నీ కూల్చివేసి బస్ టర్మినల్ నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. తాత్కాలిక బస్ షెల్టర్ల వద్ద ప్రయాణికులకు మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేయాలని కుడా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, ఆర్టీసి వరంగల్ రీజనల్ మేనేజర్ వి.శ్రీలేఖ, డిఈ సుధాకర్, వరంగల్ 2 డిపో మేనేజర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి పవిత్రోత్సవం






నవతెలంగాణ-మట్టెవాడ

వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో పవిత్రోత్సవం అత్యంత వైభవోపేతంగా బుదవారం నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు నేతత్వంలో ఈ తంతు జరుగుతున్నంతసేపు భక్తులు ఎంతో ఉత్సాహంతో భక్తిభావంతో ఈ క్రతువును వీక్షిస్తూ పవిత్రధారణ అయిన అనంతరం అమ్మవారిని దర్శించి మంత్రముగ్ధులై ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యారు. సంవత్సరంపాటు అమ్మవారికి జరుపబడిన పూజారాధనలో అర్చకుల వల్లగాని, అధికారుల వల్లగాని, భక్తుల వల్లగాని తెలిసీ తెలియక ఏర్పడిన లోటుపాట్ల వల్ల సంక్రమించిన పాపంనివృత్తి జరిగి శుద్ధిసంపాదనం జరుగడంతోపాటు సంవత్సరాంతం జరిపిన పూజారాధనలకు పరిపూర్ణత్వం కలిగి లోకకళ్యాణం సిద్ధించడం కోసం ఆగమ శాస్త్రాల ప్రకారం ఈ పవిత్రోత్సవాన్ని ఆలయంలోని వేద పండితులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఈ ఓ శేషు భారతి, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ అన్ని శైవ, వైష్ణవ దేవాలయాలలో ఈ పవిత్రోత్సవానికి చాలా ప్రాధాన్యత ఉండగ అమ్మవారి దేవాలయాలలోకి వచ్చేసరికి తెలుగు రాష్ట్రాలలో కేవలం భద్రకాళీ దేవస్థానంలోనే ఈ ఉత్సవం విధిగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఊర్ణసూత్రాలు (ఉలనారాలు) సేకరించి పెద్దపెద్ద దండలుగా ముత్తయిదువులతో ఈ పవిత్రల నిర్మాణం జరుపబడుతుందనీ. ఈ పవిత్రల తయారీకి దాదాపువారం రోజులు పట్టింది. అంతేగాక పట్టుదారంతో చేసిన పవిత్రలను తమిళనాడు నుండి కూడా తెప్పించడం జరిగినదనీ. ఈపవిత్రలకు శుద్ధి సంస్కారాలు, అధివాసాలతోపాటు ఆగమోక్తమైన తంతు గత రెండురోజులుగా నిర్వహించి ఈ రోజు అమ్మవారికి ఉదయం అభిషేకం జరిపిన అనంతరం ఈ పవిత్రలను అర్చకులు ధరింపజేశారనీ అన్నారు. అమ్మవారికి 5 రకముల భోగములు (పులిహోరం, దధ్యోదనం, శర్కరపొంగలి, జీరకాన్నం, వంగీబాత్) నివేదనలు జరిపి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. భక్తులందరికీ ప్రధాన పుజరులు శ్రీ భద్రకాళిశేషు భక్తులకు రక్షాబంధనం నిర్వహించారు.

ధర్మ మార్గాన్ని మించిన న్యాయ శాస్త్రం లేదు

విఖనస సేవా సమితి ప్రతినిధి డాక్టర్ దివి అజిత్‌కుమార్



నవతెలంగాణ-హసన్‌పర్తి

ప్రపంచంలో ధర్మ మార్గాన్ని మించిన న్యాయ శాస్త్రం మరొకటి లేదని డాక్టర్ దివి అజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టు క్రాసురోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీమద్విఖనస జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీమద్విఖనస సేవా సమితి అధ్యక్షులు వేదాంతం పార్థసారదాచార్యులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ దీవి అజిత్ కుమార్ మాట్లాడుతూ వేదోక్తధర్మమార్గాచరణ, భక్తితత్వఅనుకరణ సమగ్రంగా నిర్వచించి చెప్పిన భగవత్ శాస్త్రమే వైఖానస ఆగమ మన్నారు. పవిత్రమైన అత్యంత ప్రాచీనచరిత్ర కలిగిన శ్రీవైఖానస ఆగమశాస్త్రాల అనుగుణంగానే ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక ఆరాధన కేంద్రంగా విలసిల్లుతున్న తిరుమల ఆలయంలో శ్రీవైఖానస ఆగమంప్రకారంగా అర్చనలు జరుగుతున్నాయన్నారు. వేదవాఙ్మయంతో పాటు పురాణ ఇతిహాసాలలో సైతం శ్రీ వైఖానస శాస్త్ర ఔన్నత్యాన్ని ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా భగవాన్ విఖనస మహర్షికి పంచామత అభిషేకం, విశేష అర్చనలు ఆలయం అర్చకులు నిర్వహించారు. అనంతరం విఖనస స్తోత్రపఠనం చేసారు. పలువురు వక్తలు విఖనస గొప్పదనాన్ని శ్లాఘించారు. అనంతరం తీర్థప్రసాదాలు వినియోగ గోష్ఠి జరిగింది. ఈ కార్యక్రమంలో వేదాంతం సంపత్ ఆచార్యులు, దీవి రాంబాబు చక్రవర్తి, దీవి రాంబాబు, వేదాంతం మురళీ, పరాశరం సత్యనారాయణ చార్యులు, పరాశరం ఆదిత్య రాఘవ, పరాశరం రాము, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, దీవి కేశవాచార్యులు, దీవి తాండవ కష్ణ, పరాశరం శ్రీనివాస్ చార్యులు, వేదాంతం శరత్, నరహరి సునీల్, వేదాంతం శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు









మంత్రి ఎర్రబెల్లికి రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు

నవతెలంగాణ-వరంగల్

రక్షా బంధన్‌ను పురస్కరించుకుని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి , గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో వారి సోదరిమణులు బియ్యాల నళినీ దేవి, తక్కెళ్ళపల్లి వారిజలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా మంత్రి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

పర్వతగిరి : రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు గురువారం పర్వతగిరి మండలం ఎంపీపీ లునావత్ కమల, అన్నారం షరీఫ్ సర్పంచ్ యశోద,పర్వతగిరి సర్పంచ్ చింత పట్ల మాలతి సోమేశ్వర రావు, ఇస్లావత్ తండ సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, ఎంపీటీసీలు మోహన్ రావు, మాడుగుల రాజు, భాస్కర్,మండల కో-ఆప్షన్ సభ్యుడు షబ్బీర్ అలీ, బీ ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రంగు కుమార్, వార్డు రావూర్ సర్పంచ్ బండి సంతోష్ కుమార్, మూడు తండ నాయకులు మూడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు. హనుమకొండలో రిటైర్డ్ సీపీ, వర్ధన్నపేట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఆర్.నాగరాజు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్‌లకు రాఖీ పండుగ సందర్భంగా ఎంపీటీసీలు అత్తి రేవతి, బొట్ల మహేంద్ర, లావుడియా సరోజన, మాలోతు కాంతమ్మలతోపాటు ఇస్లావత్ తండా మాజీ ఉప సర్పంచ్ సావిత్రమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్ తదితరులు రాఖీలు కట్టారు.

కడియంను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-పర్వతగిరి

మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా పర్వతగిరి సర్పంచ్ చింత పట్ల మాలతి సోమేశ్వరరావు గురువారం కడియం శ్రీహరి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ మాడుగుల రాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షలు రంగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టు భర్తీకి డెమో

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పర్వతగిరిలో తాత్కాలికంగా ఫిజిక్స్ బోధించుటకుగాను పోస్టును భర్తీ చేయుటకు ఎమ్మెస్సీ బీఈడి కలిగి ఆసక్తి, ఉత్సాహం గల అభ్యర్థులకు ఈ నెల 2న డెమో నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ సమ్మయ్య గురువారం తెలిపారు. అభ్యర్థులు నేరుగా కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని గట్లకానీపర్తి మాజీ ఉపసర్పంచ్ బొమ్మకంటి సుగుణ సాంబయ్య దంపతుల కుమార్తె కల్పన, అరుణ్‌కుమార్ వివాహ వేడుక గురువారం దామెరలోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ వివా హ వేడుకలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

సామూహిక యజ్ఞోపవీతధారణ

నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట గ్రామంలోని శివ మార్కండేయ, వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాలలో, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు మార్తా రాజ్ కుమార్, ఆరుట్ల కష్ణమాచార్యులు వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మార్కండేయ ఆలయంలోసత్యనారాయణ స్వామి వ్రతాన్ని, గాయత్రి హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు బాసాని సూర్య ప్రకాష్, సామల బిక్షపతి, మాజీ చైర్మన్ సామల సదానందం, హోంగార్డు గొట్టిముక్కల రమేష్, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని ఉబ్బని వెంకటయ్య గురువారం మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను స్థానిక సర్పంచ్ చింత పట్ల మాలతి సోమేశ్వర రావు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉప సర్పంచ్ రంగు జనార్థన్, వార్డు సభ్యులు నాగుల బాబు, చీదురు తిరుపతి, బిఆర్ఎస్ పార్టీ మండల కార్మిక సంఘం అధ్యక్షుడు తుంగ రాజు, ప్రధాన కార్యదర్శి బొట్ల శ్రీకాంత్ నాదరపు నర్సయ్య, చీదురు యాకాంతం తదితరులు ఉన్నారు.

21వ శతాబ్దంలో జీవ నైపుణ్యాలే కీలకం : డాక్టర్ పృథ్వీరాజ్



నవతెలంగాణ-వరంగల్

21 వ శతాబ్దంలో జీవ నైపుణ్యాలే కీలకం అని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ నవనిర్మాణ్ కోచ్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ అన్నారు. వాసవిక్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం విద్యార్థులకు వివిధ జీవనైపుణ్య అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు డొమైన్ విజ్ఞానంతో పాటుసాఫ్ట్ స్కిల్స్ పై ప్రాధాన్యత పెంచుకోవాలి అన్నారు. మారుతున్నా సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థుల్లో మార్పులు రావాలన్నారు. సాంకేతిక అభివృద్ధి మానవాళి మనుగడతో పాటు నాణ్యమైనజీవనవిధానంకు తోడ్పడాలని పేర్కొన్నారు. మానవీయ విలువలే ప్రధాన భూమిక వహించాలని విద్యార్థులు తమ విలువైన సమయాన్ని అంతర్జాలంలో గడపటం కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో గడిపితే సమాజమే కొన్నినైపుణ్యాలు ను నేర్పుతుందన్నారు. సోషల్ మీడియాకు బానిస కావద్దు, డ్రగ్స్‌కు దూరంగాఉండి, లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.ప్రభాకర్, వాసవిక్లబ్ వరంగల్ అధ్యక్షులు ఆచార్య గుంటూరు వెంకటనారాయణ, వేనిశెట్టి ఉమామహేశ్వర్, గన్ను సంపత్‌కుమార్‌తో పాటు డాక్టర్ గన్ను నటరాజ్‌శేఖర్, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం కళాశాల, వాసవి క్లబ్ వరంగల్ వారు నవనిర్మాణ్ కోచ్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌ను శాలువా, జ్ఞాపిక అందజేసి పూలగుచ్చంతో ఘనంగా సన్మానించారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు మంచి గుర్తింపు

కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి



నవతెలంగాణ-హసన్‌పర్తి

ఉద్యోగి తనఉద్యోగకాలంలో అందించిన ఉత్తమ సేవలతోనే మంచి గుర్తింపు ఉంటుందని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అన్నారు. మండంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కమిటీ హాలులో హెల్త్ సూపర్‌వైజర్ వెలదంది నీలకంఠం పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వొడితల కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్‌కళాశాల సిబ్బందికి అంకితభావంతో నిస్వార్థసేవలు అందించిన నీలకంఠం సేవలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నీలకంఠం హెల్త్ సూపర్వైజర్‌గా 22 ఏళ్లుగా డిస్పెన్సరి విభాగంలో సేవలందించారన్నారు. అతను 2001లో కిట్స్ వరంగల్‌లో మల్టీపర్పస్ హెల్త్‌సూపర్వైజర్‌గా చేరారన్నారు. ఆరోగ్యసమస్యల పరిష్కారంలో అతను డైనమిక్, సాఫ్ట్‌కార్నర్, స్నేహపూర్వకంగా ఆప్యాయతతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సేవలు అందించిన ప్రైమరీ వైద్యుడిగా పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం వివిధ విభాగాల డీన్లు, వివిధ విభాగాల హెడ్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సన్మానగ్రహీత నీలకంఠం కుటుంబ సభ్యులు, అతని భార్య రేణుక, కుమారుడు శశాంక్, కూతురుభార్గవిలను 145 మంది అధ్యాపకులు, సిబ్బంది నీలకంఠం రిటైర్మెంట్ సందర్భంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిట్స్‌యాజమాన్య సభ్యుడు డాక్టర్ వి.పవన్‌కుమార్, కిట్స్ వైద్యురాలు వి.సుష్మిత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పింగిళి రమేష్‌రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ వి.రాజగోపాల్, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీను సేవలు మరువలేనివి

కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్

నవతెలంగాణ-హసన్‌పర్తి

ప్రజా నాయకుడిగా పేదల పక్షపాతిగా బీజేపీ శ్రీను చేసిన సేవలు మరువలేనివని కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం పాత గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం బీజేపీ డైనమిక్ లీడర్ స్వర్గీయ గుండమీది శ్రీనివాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ సిబ్బందికి, సోమశేఖర్ ఆసుపత్రి ఆవరణలో గుడిసె వాసులకి బీజేపీ నాయకులు నిత్యావసర సరుకులు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ నాయకుడంటే గుండమీది శ్రీనివాస్ అని ఆయన పార్టీకి, ప్రజలకు అంకితభావంతో పని చేసి ప్రజాధరణ పొందిన నాయకుడని ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. యువత ఆయన సేవలను ఆదర్శంగా తీసుకొని మంచి నాయకులుగా ఎదిగినప్పుడే ఆయన ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వినర్ తాళ్లపెల్లి కుమారస్వామి, గుండమీది శ్రీనివాస్ కుటుంబ గుండమీది ధనలక్ష్మీ, చంద్రవంశీ తదితరులు పాల్గొన్నారు.



వన్యప్రాణి సంరక్షణ సామాజిక బాధ్యత



నవతెలంగాణ-వేలేరు

వన్యప్రాణి సంరక్షణ సమాజ బాధ్యత అని హన్మకొండ లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ గిల్లా పురుషోత్తం అన్నారు. అమెరికాలోని తన మనువరాలు సుమేధ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం హన్మకొండ జూపార్క్‌లోని ఎలుక జింకల పెంపుదలకు వాటి ఆహారం (దాణా) కోసం రూ.12వేల వార్షిక నిర్వాహణతో దత్తత తీసుకొన్నారు. ఈ సందర్భంగా గురువారం జూపార్క్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్ఫరాజుద్దీన్ మాట్లాడుతూ లయన్ గిల్లా పురుషోత్తం వన్యప్రాణ సంరక్షణ సమాజ బాధ్యత అని గుర్తుచేయడానికి ఎలుక జింకల దాణాకు దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్ర మంలో గిల్లా సునీల్, ఎఫ్ఆర్వో కె రాజు, ఆర్సీలయన్ సుభాష్, అంతర్జాతీయ వ్యవహారాల జిల్లా కార్యదర్శి లయన్ ఆర్.రమణారెడ్డి, కోశాధికారి లయన్ టి.రమేష్‌బాబు, లయన్ నిర్మల,లయన్ జీ.సత్యనారా యణ, లయన్ బాబు, లయన్ కిరణ్మయి, లయన్ వై రాధాకష్ణన్,లయన్ వై మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వయంకృషి వృద్ధాశ్రమంలో ఉచిత ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో గురువారం ములుగు రోడ్‌లోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో ఉచితఆరోగ్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయో వృద్ధులకు సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ ఆరోగ్య శిబిరంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రెడ్ క్రాస్ డాక్టర్లు జె కిషన్ రావు, డాక్టర్ సిహెచ్ సత్యం, స్వయంకషి ప్రెసిడెంట్ శుభ, భాగ్యమ్మ, అనిత, సుగుణ రాధా పాల్గొన్నారు.

వెలకట్టలేని బంధాలను గుర్తు చేసేదే రక్షాబంధన్

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్





నవతెలంగాణ-హన్మకొండ

వెలకట్టలేనిబంధాలను విడదీయరాని అనుబంధాలకు నిలువెత్తు నిదర్శనమే రక్షాబంధన్ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం రాఖీ పండుగ పర్వదినం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు, సోదర సోదరీమణులకు రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ క్యాంపు కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది వినయ్‌భాస్కర్ తోబుట్టువుల, బీఆర్ఎస్ పార్టీ మహిళలు, మల్లికంబా మనోవికాస కేంద్రం మరియు బాల సదనం చిన్నారుల మధ్య వినయ్‌భాస్కర్ రాఖీ పండుగ వేడుకలు జరుపుకున్నారు. పిల్లలందరికీ రాఖీలుకట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ తోడబుట్టిన అన్నా చెల్లెల్లు, అక్కాతమ్ముళ్ల నడుమ అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీబంధన్ (రాఖీపౌర్ణమి) పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు. కుటుంబ బంధాలు, రక్త సంబంధాల్లోని ఔన్నత్యాన్ని మానవ సంబంధాల్లోని పరమార్థాన్ని రాఖీల పండుగ తెలియజేస్తుందని భారతీయ సంస్కృతికి, జీవ నతాత్వికతకు రాఖీ పండుగ వేదికగా నిలుస్తుందని అన్నారు. రాఖీని రక్షాబంధంగా భావించే ప్రత్యేక సంస్కృతి మనదని అన్నాదమ్ముళ్లకు రాఖీలుకట్టడం ద్వారా తమ కు రక్షణగా నిలువాలని అక్కాచెల్లెల్లు ఆకాంక్షిస్తారు.

మానవ సంబంధాలను, కుటుంబ అనుబంధాలను మరింతగా బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ కార్యాచరణ రూపొందించి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాడన్నారు. మానవీయ పాలనే లక్ష్యంగా అమలు చేస్తున్న పలు పథకాలు వద్దులు తదితర రక్షణ అవసరమైనవర్గాలకు భరోసానందిస్తున్నాయన్నారు. సంపదను సృష్టించి సకలజనులకు పంచుతూ కొనసాగుతున్న ప్రగతి ప్రస్థానం రాష్ట్ర ప్రజల నడుమ సహద్భావ వాతావరణాన్ని పెంపొందిస్తూ, సహోదరభావాన్ని పెంచుతున్న దని అనేక పథకాలను అమలు చేస్తూ, మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసానందిస్తూ, పెద్దన్నలారక్షణగా నిలిచిందని తెలిపారు. ఫలితంగా నేడు తెలంగాణ రాష్ట్రంలోని మహి ళలు అన్నిరంగాల్లో రాణిస్తూ, విజయ ప్రస్థానాన్ని సాగిస్తూ, దేశానికే దిక్సూచిగా నిలిచారని రాఖీ పండుగను ప్రజలంతా ప్రేమానురాగాలతో,ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

హనుమకొండ చౌరస్తా : రక్షాబంధన్ వేడుకలు సోదర భావానికి ప్రతిగా నిలుస్తాయని, తమ సోదరుల రక్షణ కోసం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం అనవాయితీగా వస్తుందని, నీవు నాకు రక్ష నేను నీకురక్ష మనం ఇద్దరం దేశానికి ధర్మానికి రక్ష అంటూ రక్షాబంధన్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షులు శ్రీమతి రావు పద్మ గారు అన్నారు.ఈరోజు హనుమకొండ చౌరస్తాలో బిజెపి హనుమకొండ జిల్లా మహిళ మోర్చ ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళ మోర్చ నాయకులు కార్యకర్తలు వీధులలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు, ఆటోడ్రైవర్లకు, రోజువారి కూలీలకు, వీధి వ్యాపారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ సోదరులు రక్షణ కోసం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం అనవాయితీగా వస్తుందన్నారు. అన్నాచెల్లెళ్ల అక్కాతమ్ముళ్ల ఆప్యాయత ప్రేమానురాగాలకు ప్రతికగా నిలిచే రాఖీపండగ వేడుకలను ఈ విధంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది అని అన్నారు.

రాఖీ అంటే రక్షణబంధం అని ఒకరి క్షేమాన్ని మరొకరు కోరుకుంటూ కుటుంబ బంధాలను మరింత బలపరుచుకుంటు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించుకుం టామని రావు పద్మ అన్నారు. అదే విధంగా ఈరోజు రాఖీ పౌర్ణమి సందర్భంగా దూరప్రాంతాల నుండి వచ్చే మహిళా సోదరీ మణులకు వారి గమ్యస్థానాలకు చేరవేసేందుకు కాజీపేట రైల్వేస్టేషన్, హనుమకొండ బస్టాండ్, పెట్రోల్ బంక్‌వద్ద ఉచిత ఆటోలు ర్పాటుచేయడం జరిగిందని రావు పద్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తోపుచెర్ల అర్చన మధుసూధన్, అధికార ప్రతినిధి గంట దేవేందర్ రెడ్డి, 8వ డివిజన్ అధ్యక్షులు గొనెల అనురాధ, మహిళ మోర్చనాయకులు పద్మ, తులసి, శ్రీదేవి, మంజుల, మాధవి, సులోచన, విజయ, ధనలక్ష్మి నదియా, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కార్మిక సంఘాల నేతలు టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల బిక్షపతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం, కరీంనగర్ మున్సిపాలిటీలలో జవాన్లు, డ్రైవర్లకు అమలు చేస్తున్న రూ.19వేల కనీస వేతనం రాష్ట్రమంతా అమలు చేయాలని, ప్రక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్లో 21000 ఇస్తున్నట్లుగా తెలంగాణ మున్సిపల్ కార్మికులకు కూడా ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రమాదంలో చనిపోయిన పారిశుధ్య కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని, నన్నపనేని నరేందర్ మేయర్‌గా ఉన్నప్పుడు కార్మిక సంఘాలతో కుదుర్చున ఒప్పందం ప్రకారం కార్మికుడు చనిపోతే ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్న ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ఇతర కార్మికులకు ఇస్తున్నట్టే అన్ని రకాల బెనిఫిట్స్ అమలు చేయాలని, స్వచ్ఛ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ పీఎఫ్ ఐడి కార్డులు అమలు చేయాలని, 452 మంది కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 60 ప్రకారం రూ.15,600లు వేతనాలను అమలు చేయాలని, కార్మిక పోరాటాల ఫలితంగా పెరిగిన వెయ్యి రూపాయలు నాలుగు నెలల ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని, చీపుర్లు యూనిఫామ్ చెప్పులు నూనెలు సరిపడినన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పార్సిల్దార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సెప్టెంబర్ మాసం మొత్తం సిఐటియు టిఎస్ఆర్పిఎస్ మునిసిపల్ యూనియన్లు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా గ్రేటర్ వరంగల్ లో కూడా పోరాటాలను నిర్వహించాలని సెప్టెంబర్ 11 వరంగల్ కార్పొరేషన్ సెప్టెంబర్ 30న చలో హైదరాబాద్‌లో జరిగే ధర్నాలకు మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని 52,53,54 డివిజన్లో కరపత్రాల ప్రచారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టిఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల బిక్షపతి, సిఐటియుజిల్లా అధ్యక్షుడు టీ ఉప్పలయ్య, మున్సిపల్ జేఏసీ నాయకులు వేల్పుల ధర్మరాజు, సిఐటియు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, టి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘు పాల్గొన్నారు.

అసమర్థులతో పనిచేయలేకే బీఆర్ఎస్‌లోకి నేతలు

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



నవతెలంగాణ-ఆత్మకూర్

అసమర్థ నాయకత్వం ఉన్న కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేయలేమని సమర్థవంత పాలన అందిస్తున్న బిఆర్ఎస్ లోనే చేరుతామని వలస వస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.గురువారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పూజారి రాము, బిజెపి పార్టీ మాజీ వార్డ్ మెంబర్ తోట సాంబయ్య పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే పార్టీ కండువు కప్పి స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల నియోజకవర్గం కనివినిఎరుగని రీతిలో అభివృద్ధిపథంలో దూసుకుపోతుందని వందలాది కోట్ల రూపాయలు ప్రభుత్వం నుండి తీసుకొచ్చి చేస్తున్న అభివద్ధిని చూస్తున్న ఇతరపార్టీల నాయకులు, కార్యకర్తలు సమర్థవంతన పాలన అందిస్తున్నానని వచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు.పార్టీలో చేరిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పదవులను అందిస్తానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వంగాల భగవాన్ రెడ్డి,గ్రామ అధ్యక్షులు పాపని రవీందర్,మండల కో-ఆప్షన్ మెంబర్ ఎండి అంకుష్,మాజీ ఎంపీటీసీ తోట కుమారస్వామి, బిఆర్ఎస్ నాయకులు తోట బిక్షపతి, సదయ్య, స్వామి, పిట్టల స్వామి, ఐలయ్య, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి

సీపీఎం హన్మకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య

నవతెలంగాణ-కాజీపేట

కాజీపేట మండలం 31వ డివిజన్ న్యూశాయంపేటలోని డబుల్ బెడ్ రూమ్స్ నిర్మాణంలో భూములు కోల్పోయిన 42 దళిత కుటుంబాలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని సీపీఎం హన్మకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మండల సిపిఎం మండల కమిటీ సమావేశం మండలకమిటీ సభ్యులు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో చుక్కయ్య పాల్గొని మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో దళితులకు సంబంధించిన అసైన్డ్ భూమి ప్రభుత్వం తీసుకొని ఇల్లు నిర్మించారు. తరతరాలుగా ఆ భూమిని అనుభవిస్తున్న దళితులు కోర్టుకు వెళ్లగా కోర్టు ఆదేశానుసారం భూములు కోల్పోయిన వారికి ఒక్కొక్కరికి ఒక్కొక్క డబుల్ బెడ్‌రూమ్ కేటాయించాలని కోర్టుతీర్పు వచ్చిన దానిని అమలు చేయకుండా ప్రభుత్వం అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. భూములు కోల్పోయిన దళితులు ఉండడానికి ఇల్లు లేక, కట్టుకోవడానికి స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, దళితులకు సంబంధించిన భూముల్లో డబుల్ బెడ్ రూమ్ నిర్మించి బలవంతంగా వారి భూమిని ప్రభుత్వం ఆక్రమించిందన్నారు.అట్టి భూమి ముమ్మాటికీ దళితుల హక్కులను హరించడమేనని, మానవ హక్కుల ఉల్లంఘన చేసిన ప్రభుత్వం వెంటనే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు 42మంది దళితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

లేనిచో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు తొట్టె మల్లేశం, వాస్కుల మల్లేశం, జంపాల రమేష్, సంటి రవి పాల్గొన్నారు.

బదిలీలు,పదోన్నతులు వెంటనే చేపట్టాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్



నవతెలంగాణ-హన్మకొండ

బదిలీలు, పదోన్నతుల పై హైకోర్టు స్టే తొలగించినందున, ఉపాధ్యాయుల పదోన్నతుల, బదిలీలవెంటనే చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా కార్యాలయం లో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరగిన జిల్లా కమిటి సమావేశం లో ముఖ్య అతిథిగా హాజరైన. భోగేశ్వర్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లగా పదోన్నతులు,గతఐదేళ్లగా బదిలీలు జరగక వేలాది పోస్టులు ఖాళీగా ఉండడం తో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగింది. ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగి నందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే షెడ్యూలు ప్రకటించి ప్రభుత్వమే ప్రకటించిన ఖాళీలుగా ఉన్న 2013 మంది ఎస్ఏలు గెజిటెడ్ హెచ్ఎంలుగా, ఎస్ఏలు 4163 ఖాళీలకు 2103 హెచ్ ఎం ల ప్రమోషన్స్ ను కల్పుకొని 5563 మంది ఎస్ఏలుగా, 2130 పిఎస్‌హెచ్ఎంలాగ పదోన్నతులు ఇవ్వాలని ఈ పదోన్నతుల ద్వార ఏర్పడిన ఖాళీల నోటిఫికేషన్ ప్రకటించాలని దాని వల్ల నిరుద్యోగులకు లాభం జరగుతుంది. కావున గత మార్చి లోనే పదోన్నతుల, బదిలీల కోసం ధరకాస్తులు చెసు కున్నందున కొన్ని సవరణ ల తో తక్కువ సమయం లోనే బదిలీలు ,పదోన్నతులు నిర్వహించ వచ్చని అన్నారు. ప్రభు త్వం ఆలస్యం చేయకుండ వెంటనే షెడ్యూలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్‌బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి పూజారి మనోజ్,జిల్లా ఉపాధ్యక్షుడు జె.స్వామి, ఈదుల వీరాస్వామి, కమిటి సభ్యులు మనుపాటి వెంకట్, మండల పూర్వ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి .అశోక్ అధ్యక్ష ,కార్యదర్శులు బి.పూర్ణ చందర్, దోనం రమేష్‌లి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఫాదర్ కొలంబో : బిషప్ ఉడుముల బాల



నవతెలంగాణ-ధర్మసాగర్

ఫాదర్ కొలంబో ఈ నగరా ప్రాంతానికి చేసిన అభివద్ధి పనులకు ప్రజలు ఆయనను ఎన్నటికీ మర్చిపోలేని చిరస్మరణీయుడు ఫాదర్ కొలంబో గారని ఓరుగల్లు పీఠాధిపతులు మహా ఘనత వహించిన ఉడుముల బాల అన్నారు. మండలంలోని కరుణాపురం గ్రామంలో ఘనంగా ఫాదర్ కొలంబో 14వ వర్ధంతి వేడుకలను గురువారం విచారణ గురువులు ఫాదర్ సుధాకర్ గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓరుగల్లు పీఠాధిపతులు మహా ఘనతవహించిన డాక్టర్ ఉడుమల బాల గారు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. ఫాదర్ కొలంబో గారు ఓరుగల్లు మేత్రాసనానికి మరియు కరుణాపురం విచారణకు ఆయన చేసిన విశిష్ట సేవలు గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోని అనేకమందికి ఉన్నత జీవితాన్ని అందించిన గొప్ప వ్యక్తిని అంతేకాకుండా ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలకు నిలియంగా పెద్దపెద్ద కట్టడాలను నిర్మించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్న మహోన్నత వ్యక్తిని కొలంబో గారని అన్నారు.ఆయన చేసిన సేవకు నేడు మన ప్రత్యక్షంగా వద్దులకు వితంతువులకు చెవిటి మూగవారికి అనాధలకు ముఖ్యంగా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు చేసిన సేవకు ఆయన చిరస్మరణీయులుగా చిరంజీవిలుగా నిలిచారని వారికి ఆ దేవాది దేవుడు అతని ఆత్మకు నిత్యవిశ్రాంతి దయ చేయునట్లుగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కరుణాపురం సర్పంచ్ కలకోటి అనిల్‌కుమార్,మాజీ ఎంపిటిసి సిక వసంత, గ్రామపెద్దలు రాజారపు దేవయ్య ,పాశం సంజీవ,రాజరపు విమల,యువత అధ్యక్షుడు గాదె తరుణ్,గుర్రపు ప్రవీణ్,నరేష్, భార్గవ్, పవన్, వంశీ, నిర్మల్, క్రైస్తవ విశ్వాసులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం

అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అర్చకులకు రూ.10 వేలు పెంపొందిస్తూ జీవో జారీ చేసినందుకు బుధవారం సచివాలయంలో అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ధూప, దీప, నైవేద్య అర్చకులకు 6,540 దేవా లయాల అర్చకులకు రూ.10 వేలు వర్తింపజేస్తున్నారని ఇంకొక వేయి దేవాలయాలకు ధూప,దీప, నైవేద్యపథకం అందించాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు వాసుదేవశర్మ, పెన్నా మోహన్ శర్మ, ఎన్ సతీష్ శర్మ, ఏ.ప్రసాద్‌శర్మ, గోపీకష్ణమాచార్యులు మంత్రిని కలిసవారిలో ఉన్నారు. మంత్రిగా పట్నం మహేందర్రెడ్డి బుధవారం సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రులు దయాకర్రావు, శ్రీనివాసయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మంత్రి మహేందర్‌రెడ్డిని గంగు ఉపేంద్రశర్మ వేదాశీర్వచనంతో అభినందించారు.

9న జాతీయ లోక్ అదాలత్

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె రాధాదేవి



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలను అనుసరించి, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెప్టెంబర్ 9 శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను వరంగల్ జిల్లా కోర్టులో, నర్సంపేట మండల కోర్టులో నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేస్తున్నామని వరంగల్ జిల్లాప్రధానన్యాయమూర్తి కె.రాధాదేవి గురువారం తెలిపారు. కక్షిదారులు తమ వీలును బట్టి తమ కేసులను ఈనెల 2 నుండి 9వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఏ రోజైనా రాజీ కుదుర్చుకునేలా ప్రీ-లోక్ అదాలత్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రీ-లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూతగాదాల కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, విద్యుత్ చోరీ, కన్స్యూమర్ ఫోరమ్ కేసులు, ట్రాఫిక్ ఈ-ఛాలన్ కేసులు మరియు ప్రీ- లిటిగేషన్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ ప్రీ-జాతీయ లోక్ అదాలత్ నందు కక్షిదారులు హాజరై, తమ తమ కేసులను వారికి వీలయిన రోజునే పరిష్కరించుకునేలా అవకాశం కల్పిస్తున్నామన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియపరిచి, రాజీ కుదుర్చుకుని, కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలన్నారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఈ ప్రీ-లోక్ అదాలత్ పట్ల ఎటువంటి సలహాలు, సందేహాలు, ఏదేని న్యాయసహాయం కొరకు అయిననూ న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవలసిందిగా తెలియజేశారు. ప్రీ-లోక్ అదాలత్ పట్ల మరింత సమాచారం కొరకు 9391807362 నంబర్ కు కాల్ చేసి, సందేహాలను నివృత్తి చేసుకోగలరని తెలిపారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు



నవతెలంగాణ-హనుమకొండ

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రత్యేక రక్షాబంధన్ అని అన్నాచెల్లె ళ్ల అనురాగానికి వెలకట్టలేని పండగే రక్షాబంధన్ అని గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ కార్పొరే టర్ మామిండ్ల రాజు అన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రేటర్ 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు హనుమకొండ న్యూ శాయంపేటలోని తమ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. తమ సోదరీ మణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతిరూపంగా జరుపుకునే అపురూపమైన వేడుక రాఖీ పండుగ ఈ సందర్భంగా ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

వికలాంగురాలికి లయన్స్‌క్లబ్ ఆర్థిక చేయూత

నవతెలంగాణ-వేలేరు

హన్మకొండ లయన్స్‌క్లబ్ వారు తమ కార్యాలయంలో అధ్యక్షులు లయన్ సయ్యద్ సర్ఫరాజుద్దీన్ ఆధ్వర్యంలో వరద బాధిత వికలాంగురాలు సౌమ్యకు గురువారం రూ. 24వేల ఆర్థిక సహాయం చేసారు. ఈ సందర్భంగా సర్ఫరాజు ద్దీన్ మాట్లాడుతూ లయన్ రాంచదర్ రావు ప్రధానంగా రూ 10 వేలు, లయన్ పోకల చందర్, లయన్ సుభాష్ ల సహకారంతో ఆర్థిక సహాయం అందజేసా మన్నారు. హన్మకొండ లయన్స్‌క్లబ్ మెంబర్స్ సహకారంతో సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో లయన్ రమణారెడ్డి, లయన్ వినోద్, లయన్ ఆనంద్, లయన్ రమేష్ బాబు, లయన్ ఎస్ఎం రెడ్డి, ఇతర లయన్స్ పాల్గొన్నారు.



ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



నవతెలంగాణ-శాయంపేట

మండల పరిధిలోని 24 గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సుదూర ప్రాంతాలలో ఉన్న ఆడపడుచులు పుట్టింటికి చేరుకొని సోదరులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల ప్రేమ అనుబంధాలకు ప్రతీకగా రాఖీపౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకలతో గ్రామాలు నూతనశోభను సంతరించుకున్నాయి. శాయంపేట సెంటర్లో రాఖీల విక్రయాలు, స్వీట్ల విక్రయాలు జోరందుకున్నాయి.

అన్నివర్గాల అభివృద్దే బీజేపీ లక్ష్యం

నవతెలంగాణ-నడికుడ

దేశంలో అన్ని వర్గాల ప్రజల అభివద్దే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి అన్నారు. బిజెపి పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బిజెపి పార్టీలో అమిత్ షా ఆధ్వర్యంలో చేరిన ప్రముఖ వైద్యుడు, ప్రజలకు సేవ చేసే గుణమున్న డాక్టర్ కాళీ ప్రసాద్ గురువారం పరకాల నియోజకవర్గంలోని నడికూడ మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో మొదట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజ చేసిన అనంతరం శ్రీ భూ నీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సోదరీమణులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో బిజెపి పుంజుకుందని అందులో భాగంగా పలువురు ప్రముఖులు, ప్రజలు బిజెపిలో చేరుతున్నారని ఖమ్మంలో జరిగిన భారీ సభలో నియోజకవర్గంలోని ఇతర పార్టీ నాయకులు 2500 మంది బిజెపిలో చేరారన్నారు. బిజెపిపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కాళి ప్రసాద్ చేరడంతో బిజెపికి కొత్త ఉత్సాహం వచ్చిందని అన్నారు.

ఆడబిడ్డ ఆశీస్సులు తీసుకున్న డాక్టర్ కాళి ప్రసాద్

నడికూడ మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి ఆశీస్సులు తీసుకున్న అనంతరం గ్రామానికి చెందిన ఆడబిడ్డ కొనుగాటి అక్షిత బిజెపి నాయకులు డాక్టర్ కాళీ ప్రసాద్‌కు రక్ష కట్టి ఆశీస్సులు అందజేశారు. రాఖీ కట్టిన ఆడబిడ్డకు రాఖీ కాను కగా పై చదువులు ఉచితంగా చదివిస్తానని అభినందనలు తెలిపారు. వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతోపాటు వెంకటేశ్వర పల్లి గ్రామ ప్రజల ఆశీస్సుల కోసం ఈ గ్రామానికి వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పి జయంత్ లాల్, పగడాల రాజకుమార్, ఎరుకల దివాకర్, కంటత్మకూర్ ఎంపీటీసీ గుండెబోయిన రాజు, రాజిరెడ్డి,గోనెల కోటేశ్వర్, దండు సురేష్, పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త బిక్షపతి, ఆకుల రాంబాబు, బిజెపి నాయకులు మేకల రాజవీరు, దుబాసి వెంకటస్వామి , పాలకుర్తి తిరుపతి, చనుమల సాంబ రెడ్డి, మాజీ సర్పంచ్ మారబోయిన శివకుమార్, పర్నం రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సద్దాం హుస్సేన్‌కు బెస్ట్ క్యాటరింగ్ సర్వీస్ అవార్డు



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

గత పది సంవత్సరాలుగా ఫుడ్ క్యాటరింగ్ సర్వీస్ చేస్తూ తన వంటకాలతో ప్రజలకు రుచులు చూపిస్తున్న సద్దాం క్యాటరింగ్ సర్వీసెస్ ప్రొప్రైటర్ మహమ్మద్ సద్దాంహుస్సేన్‌కి హైదరాబాద్‌లోని హెూటల్ తాజ్ డెక్కన్ లో ఆగస్టు 27న జరిగిన కాన్ఫరెన్స్ లో బిజినెస్‌మింట్ సంస్థ 2023 సంవత్సరానికి గాను బెస్ట్ క్యాటరింగ్ సర్వీస్ అవార్డు మన ఓరుగల్లు బిడ్డ నిర్వహిస్తున్న సద్దం క్యాటరింగ్ సర్వీసెస్ ప్రొప్రైటర్ మహమ్మద్ సద్దాం హుస్సేన్ కి దక్కింది. మన ఓరుగల్లు బిడ్డ కు ఈ అవార్డు దక్కినందుకు సద్దాం హుస్సేన్‌ను దర్గాలో మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, అయుబ్ ఖాన్ ముసుఫ్, యాకుబ్ అభినందించారు.

బీజేపీలోకి మాజీ సర్పంచ్

నవతెలంగాణ-దామెర

దామెర మండలంలోని పులుకుర్తి బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ పేరుక సత్యం బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా వారిని స్వాగతించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పెసరు విజయ చందర్‌రెడ్డి బిజెపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి గన్ను సతీష్, పెంచాల జగన్ ,శ్రీనాథ్, వేణు ,రాకేష్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తిని సందర్శించిన సింగపురం ఇందిర



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

పుట్టపర్తిలోని సత్యసాయి ఆలయాన్ని గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సింగపురం ఇందిర ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

3

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

జనగామ

శుక్రవారం | సెప్టెంబర్ 01, 2023 | www.navatelangana.com

ఘనంగా జంజిరాల పౌర్ణమి వేడుకలు



నవతెలంగాణ-పాలకుర్తి

జంజిరాల పౌర్ణమి(నూలు పోగు పౌర్ణమి)ని పురస్కరించుకొని గురువారం మండలకేంద్రంలో పద్మశాలిలు భక్త మార్కండేయ మహర్షికి సమర్పించే పట్టు వస్త్రాలను పట్టణ అధ్యక్షుడు చిలకమారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిలకమారి ఉప్పలయ్య ఇంటి నుండి పద్మశాలిలు కలిసి బ్యాండ్ మేళాలతో గుడివాడ చౌరస్తా నందు గల ఓంకారేశ్వర ఆలయం(పంచగుళ్ల) దేవాలయం వరకు ఊరేగింపుగా చేరుకోవడంతో ఆలయ అర్చకులు గంగు రఘుశర్మ శ్రీ భక్త మార్కండేయ స్వామికి పంచామతా భిషేకం, గణపతి హోమం, యజ్ఞోపవిత ధారణ జరిపారు. అనంతరం పద్మశాలీలు అధికంగా జంజిరాలను, యజ్ఞోప వితాధారణ చేసి, గాయత్రీ మంత్రం ఉచ్చరించి భక్తిశ్రద్ధలతో ధరించారు. నూలు పోగు ఉద్భవించిన పవిత్రమైన నూలు పౌర్ణమి, రక్షా బంధన్‌ను పట్టణ పద్మశాలిలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని రమేష్, చిలుకమారి సోమేశ్వర్, తెలంగాణ పద్మశాలీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, చిలుకమారి వరప్రసాద్, కాటబత్తిని సోమేశ్వర్, కూరపాటి సుదర్శన్, వైట్ల పుండరీకుడు, భారత వెంకన్న, చిలుకమారి శివ, మేడారపు సోమనారాయణ, వన్నాల ధనుంజయలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఉత్సాహంగా రాఖీ పండుగ వేడుకలు









నవతెలంగాణ-తరిగొప్పుల

సోదరీమణులు, సోదరుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో గురువారం ఘనంగా జరిగాయి. వయసు తారతమ్యం లేకుండా అందరూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటా రాఖీ పండుగ సందడి నెలకొంది. సుదూర ప్రాంతాలలో ఉన్న సోదరీమణులు తమ పుట్టిళ్లకు వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీ పౌర్ణమి, సందర్భంగా మండల కేంద్రంలోని ఫ్యాన్సీ షాపులు, స్వీట్ స్టాల్సు, పండ్ల దుకాణాలు కొనుగోలు దారులతో సందడిగా కనిపించాయి.

ప్రేమానురాగాల ప్రతీకకు చిహ్నం రక్షా బంధన్

పాలకుర్తి రూరల్ : ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమికి రక్షాబంధన్, రాఖీ పౌర్ణమి అనే పేర్లతో పిలుస్తారు. ఈ రాఖీ పౌర్ణమికి దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. గతంలో ఇట్టి రాఖీ పౌర్ణమికి జంధ్యాల పౌర్ణమి అని పేరుతో పిలిచేవారు. జంజం ధరించే వివిధ వర్గాలైన బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, లింగ బలిజ, మరికొన్ని సామాజిక తెగలవారు జంధ్యం ధరించిన వారు ఇట్టి రాఖీ పౌర్ణమి రోజున పాత జన్యం తొలగించి క్రొత్తగా వేసుకునేవారు. రాను రాను కాలక్రమంలో జంధ్యాల పౌర్ణమి పోయి రాఖీ పౌర్ణమిగా సమాజంలో పేరు ప్రసిద్ధికెక్కింది. తెలంగాణలో బతుకమ్మ పండుగ తర్వాత అత్యంత ప్రాచుర్యం పొందిన ఉత్సవంగా రాఖీ పండుగ స్థానం సంపాదించింది. ఇట్టి రాఖీ పండుగ రోజు అక్కలు, చెల్లెళ్లు తమ సోదరుల విజయాన్ని, ధన, ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ రాఖీలను కట్టే సంప్రదాయం కొనసాగుతుంది. కుటుంబంలో వివిధ రకాల సామాజిక కారణాలవల్ల కొంతకాలం మాట్లాడకుండా ఉన్న సోదర సోదరీమణులు కూడ ఈ రాఖీ పండుగ సందర్భంగా కలుసుకొని సుఖసంతోషాలను పంచుకునే అవకాశం కొనసాగుతుంది. ఏది ఏమైనా అక్క చెల్లెళ్ల, అన్నదమ్ముల మధ్య అంతరాలను తొలగించి ప్రేమ పూర్వకమైన, ఆహ్లాదకరమైన ప్రేమ, సంతోషాల మేలు కలయిక కొనసాగుతున్న రాఖీ బంధన్ విజయోత్సవం సమాజానికి మేలు కలిగి సమ సమాజం అభివృద్ధి చెందాలి.

మంత్రి ఎర్రబెల్లికి రాఖీ కట్టిన మహిళ, రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన ఝాన్సీ

పాలకుర్తి : అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి రాఖీ వేడుకలు ప్రతిరూపంగా నిలిచాయి. గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు మహిళ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపగా, పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. నాన్నలోని చివరి సగం కలిపితేనే అన్న, అమ్మలోని కమ్మదనాన్ని, నాన్నలోని తీయదనాన్ని ప్రతి అన్నా, తమ్ముడు అక్క చెల్లెలికి అందించాలని కోరుకుంటారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఇంట సందడిగా మారింది. అన్న తమ్ముడికి అక్క చెల్లెలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి హరీష్ రావుకు రాఖీ కట్టిన జిల్లా దిశ కమిటీ సభ్యులు

లింగాలఘనపురం : రాఖీ పండగ సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకి జనగామ జిల్లా దిశా కమిటీ సభ్యురాలు ఉడుగుల భాగ్యలక్ష్మి రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్ రేడప్పంగి సైదులు, లింగాలగణపురం మండలం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గండి శ్రీను, బీఆర్ఎస్ నాయకులు గట్టగల్ల రమేష్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో వెల్లివిరిసిన ప్రేమానురాగాలు

బచ్చన్నపేట : బచ్చన్నపేట మండలంలోని గ్రామాల్లో గురువారం నాడు రక్షాబంధన్ పర్వదిన వేడుకలను ప్రజలు అత్యంత ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకైన రాఖీ పండుగను పురస్కరించుకొని గురువారం నాడు డివిజన్ వ్యాప్తంగా ప్రతి ఇంట్లో ఆనందోత్సాహాలు ప్రేమానురాగాలు వెల్లివిరిసాయి. రాఖీ పండుగ సందర్భంగా గురువారం తెల్లవారుజాము నుండి అక్క చెల్లెల్లు తమ సోదరులకు రాఖీలు కట్టి వారు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో తులతూగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందజేశారు. రాఖీ పండుగ సందర్భంగా తమతమ సోదరులకు రాఖీలు కట్టి కలకాలం తమకు రక్షగా ఉండాలని వారు ఆకాంక్షించారు. తమకు రాఖీలు కట్టిన సోదరీమణులకు సోదరులు తమ శక్తి మేరకు కానుకలు అందజేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కలకాలం వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాఖీ పండుగను పురస్కరించుకొని గురువారం జనగామపట్టణ, మండల కేంద్రంలో రాఖీలు అమ్మే దుకాణాలు వినియోగదారులతో సందడిగా కనిపించాయి. అదేవిధంగా మిఠాయి దుకాణాలు కూడా పెద్ద ఎత్తున వినియోగదారులతో కళ కళ లాడాయి. రాఖీలు కట్టి తమ సోదరులకు మంగళహారతులు ఇచ్చి సోదరీమణులు రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

లింగాలఘనపురం : రాఖీ పౌర్ణమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ప్రజలు అన్నా చెల్లెలు అక్క తమ్ముడు రాఖీలు కట్టి తోబుట్టులను ఆశీర్వదించారు వేకువజామున లేచి ఇల్లు వాకిళ్లు శుభ్రపరచి నూతన దుస్తులు ధరించి సాంప్రదాయబద్ధంగా రాఖీ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు.







బాధితుని కుటుంబానికి ఝాన్సీ రెడ్డి చేయూత

ఇంటి నిర్మాణం చేయిస్తానని భరోసా



నవతెలంగాణ-పాలకుర్తి

మండలంలోని ముత్తారం గ్రామ శివారు దంతల గడ్డ తండాకు చెందిన ధారావత్ బిచ్చు పూరి గుడిసె గ్యాస్ లీక్ అయి ఇటీవలే కాలి పోవడంతో బాధితుని కుటుంబాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి చేయూత అందించి రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారని ముత్తారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని భాస్కర్ గౌడ్ తెలిపారు. గురువారం బాధితుని నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడిసె కాలడంతో సర్వం కోల్పోయిన బిచ్చు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి బాధితునికి ఇంటి నిర్మాణం చేయిస్తానని తెలిపారని. ఎంత ఖర్చయినా ఇంటి నిర్మాణం చేయించాలని గ్రామ పార్టీకి బాధ్యతలు అప్పగించారన్నారు. బంగారు తెలంగాణలో నేటికీ పూరి గుడిసెలు దర్శనం ఇస్తున్నాయని, ఎలాంటి ప్రమాదం జరిగినా పూరి గుడిసెలు కాలి పోవడంతో బాధితులు సర్వం కోల్పోవుచున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, వార్డు సభ్యులు బొబ్బల రమేష్, చిలువేరు గణేష్, నాయకులు గంగాపురం స్వామి, మిందు వెంకట్ రెడ్డి, బోయిని వెంకటేశ్వర్లతోపాటు తండా పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



మండలంలోని తాటికొండ గ్రామంలో గ్రామ పంచాయితీ సిబ్బంది కార్మికుడు పోకల నరేష్ తాత పోకల శ్రీశైలం (87) మరణించగా గురువారం స్థానిక సర్పంచ్, వైస్ ఎంపిపి దంపతులు చల్లా ఉమా దేవి సుధీర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు, వార్డు సభ్యులు రమరాజు, యూత్ నాయకులు పాలకుర్తి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

99 హామీలిచ్చి 9 మాత్రమే నెరవేర్చిన బీఆర్ఎస్

పీసీసీ సభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

గతంలో ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటివరకు 99 హామీలు ఇచ్చిన ఆ ప్రభుత్వం 9 హామీలను మాత్రమే నెరవేర్చిందని, మోసం, మాయమాటలతో ప్రజలను నయవంచనకు గురిచేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు, పీసీసీ సభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి విమర్శించారు. గురువారం ఉదయం ఆయన స్థానిక బతుకమ్మ కుంటలో వాకర్స్‌తో కలిసి నడక సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తాయని, అందులో భాగంగానే ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట నిలుపుకున్న ప్రభుత్వం సిద్ధ రామయ్య ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి రాష్ట్ర ఖజానాపై రూ.40 వేల కోట్లు భారం పడినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. తెలంగాణలో ఇప్పటివరకు బీఆర్ఎస్ ఇచ్చిన హామీలలో ఒక్క శాతం కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. మాయమాటలతో నిత్యం తెలంగాణ ప్రజలను నయవంచనకు గురిచేసిన ఘనత కేసీఆర్‌కి దక్కుతుందన్నారు. స్వాతంత్రం తెచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించి దేశాన్ని ప్రగతి వైపు నడిపించిందని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వాలు స్థాపించిన పబ్లిక్ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అంగట్లో సరుకుల లాగా అమ్ముకుంటుందని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, నాడు కాంగ్రెస్ ప్రభుత్వాలు పేద ప్రజలకు భూములు ఇస్తే నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని లాక్కుంటుందని, నిధులు, నీళ్లు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనుడు కేసీఆర్ అని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన రాఖీ పర్వదినోత్సవంలో మహిళా నాయకురాళ్లు పలువురు పార్టీ నేతలకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌ఛార్జ్ పిట్టల సతీష్, మోటె శ్రీనివాస్, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సిద్ధి రాములు, పలువురు స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.



అంతర్జాతీయ అధ్యక్షుని ప్రశంసలందుకున్న...

జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు

పెద్దల ప్రశంసలు, లయన్స్ సభ్యుల అభినందనలు

నవతెలంగాణ-జనగామ

అవిభక్త వరంగల్ జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న 320ఎఫ్ జిల్లాకు గత లయనిస్టిక్ సంవత్సరం 2022-23లో జిల్లా గవర్నర్‌గా పని చేసిన లయన్ కన్న పరశురాములుకు అరుదుగా లభించే అంతర్జాతీయ అధ్యక్షుని ప్రశంసా పత్రం లభించింది. అంతర్జాతీయ అధ్యక్షుడు బ్రియాన్ ఇ శిహాన్ దస్తురితో కన్నా సేవల ను ప్రశంసిస్తూ పంపిన ప్రశంసా పత్రం గురువారం కన్న పరశురాములు కొరియర్ ద్వారా అందుకున్నారు. జిల్లాలో నూతన క్లబ్‌ల విస్తరణ, సభ్యత్వ పెరుగుదల, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిధికి విరాళాల సేకరణలో విశేష రీతిలో కృషి చేయడంతో పాటు క్లబ్‌లకు అంత ర్జాతీయ సంస్థ నిర్దేశించిన సేవా కార్యక్రమాలు నిర్వహించుటలో చక్కని మార్గని ర్దేశం చేయుటలో కన్నా సఫలమయ్యారు. సంవత్సరం ముగింపు దశలో కాన్సి ట్యూషనల్ ఏరియా 6 ఇస్లామియా దేశాల పరిధిలో నిర్వహించిన పోటీలో జూన్ నెలలో 5 నూతన క్లబ్‌లు విస్తరించి సిల్వర్ అంబాసిడర్ గవర్నర్ అవార్డు కైవసం చేసుకున్న కన్నాను సీఏ 6 ఏరియా లీడర్ పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్ ప్రత్యేక జ్ఞాపికతో అభినందించారు. 1985లో జనగామ క్లబ్ సభ్యునిగా లయన్స్ వసుదైక కుటుంబంలో చేరిన కన్న పరశురాములు 1992 జనగామ ఆబాద్ క్లబ్ చార్టర్ అధ్యక్షునిగా బాధ్యతల స్వీకరణతో మొదలైన సేవా ప్రస్థానం జోన్ ఛైర్మన్, రీజియన్ ఛైర్మన్, జిల్లా క్యాబినేట్ కార్యదర్శి, పిఆర్‌ఓ తదితర అనేక రకాల పదవీ బాధ్యతలు నిర్వహించారు. 2020-21లో సెకండ్ వైస్ జిల్లా గవ ర్నర్‌గా వంద శాతం ప్రతినిధుల ఆమోదం పొంది ఎన్నికయ్యారు. మరుసటి సంవత్సరం ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్‌గా పదోన్నతి పొంది 2022-23లో జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రోది చేసుకున్న తన అనుభవాన్ని ఉపయోగించి అనూ హ్యమైన రీతిలో ప్రగతిని సాధించి పెద్దల ప్రశంసలు, లయన్స్ సభ్యుల అభినందనలు, అభిమానం చూరగొన్నారు. ప్రస్తుతం 320 మల్టిపుల్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శిగా సేవలందిస్తున్న కన్నాకు అంతర్జాతీయ అధ్యక్షుని ప్రశంసా పత్రం లభించడం పట్ల ఇటు జిల్లా నాయకులు అటు మల్టిపుల్ నాయకులు, అభిమానులు, శ్రయోభిలాషులు అభినందనలు తెలిపారు.



ప్రజా సేవకుడు ఫాదర్ కొలంబో

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

1947లో భారతదేశానికి స్వాతంత్రం వచ్చి ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఉంటే తెలంగాణ ప్రజలు మాత్రం నిజాం, నిరంకుశ పాలనలో బానిసలుగా నరక యాతన పడ్డారు. రజాకార్ల దాడికి భయపడి, ఊర్లకు ఊర్లే ఖాళీ చేసి, చెట్టుకొకరు, పుట్టకొకరుగా... అడవుల్లోకి పారిపోయారు. అలాంటి తెలంగాణకు నిజాం రాక్షసపాలన నుండి 1948లో పోలీస్ యాక్షన్ వల్ల విడుదల/మోక్షం లభించింది.

నిజాం పాలన నుంచి స్వతంత్రమైతే వచ్చింది కానీ... తెలంగాణలో దొరల భూస్వాముల నుండి దళిత గిరిజన బీసీ కులాలకు విముక్తి లభించలేదు. బహుజన కులాలు మొత్తం వెట్టిచాకిరి కింద నలిగిపోయిందీ.... ముఖ్యంగా దళితులే ... దళితులు సమాజంలో భాగమైనప్పటికీ ఆర్థిక సామాజిక సమానత్వానికి నోచుకోలేదు. ఆ రోజుల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి కడుపులు నిండేడివి. లేనివాడు ప్రకృతి తల్లిగా చేరదీసి కడుపు నింపేది.తినడానికి తిండి లేక, చేయడానికి పని లేక భార్యా పిల్లలను ఏ విధంగా సాదుకోవాలో తెలియని గతిలేని పరిస్థితుల్లో దొరలకు, భూస్వాములకు ఎట్టి చాకిరీ చేయడానికి సిద్ధపడ్డారు. ఇదంతా 60వ దశకంలో కరువు కోరలు సాచి నృత్యం చేస్తున్న పరిస్థితుల్లో జరిగింది. అప్పుడు దళిత జాతికి ఏ దిక్కు లేకుండా పోయింది. అలాంటి అత్యంత దుర్భరమైన దయనీయమైన పరిస్థితులు. అప్పుడు దళిత జాతి ఉద్ధారకుడిగా పీడిత ప్రజల దీన బాంధవుడిగా ఫాదర్ కొలంబో మన దేశంలో కాలుమోపాడు.

ఫిబ్రవరి 11, 1952వ సంవత్సరంలో ఇటలీ నుండి క్రైస్తవ మత ప్రచారకుడిగా హైదరాబాదుకు వచ్చి, బ్రాహ్మణపల్లిలో కొన్ని నెలలు ఉన్నారు. ఫాదర్ ఎల్బినో బోర్డ్ లేట్ (1912-65) పీఏఎంఈ.. పొలిటికల్ ఇనిస్ట్యూట్ ఫర్ ఫోరిన్ మిషన్స్ సహాయంతో తెలుగు భాషను నేర్చుకున్నాడు. హైదరాబాద్ నుండి ఖమ్మం చేరుకొని నాయుడుపేటలో 104 ఎకరాల బీడు భూమిని ఏరు ప్రక్కన కొన్నాడు. ఏరు బాగా పొంగినప్పుడు మొత్తం ఆ 104 ఎకరాల భూమి కొట్టుకుపోతుందని ఈయనకు పిచ్చా.. ఎందుకు ఈ భూమిని కొన్నాడని అందరూ ఎగతాళి చేశారు. అయినప్పటికీ ఆయన కుంగిపోలేదు. అదే ప్రాంతంలో లోడీ ఫామ్ అనే స్వచ్ఛంద సంస్థను 1965 జనవరిలో స్థాపించాడు. తద్వారా దళితులకు వ్యవసాయ మెలకువలు నేర్పించి ఆ 104 ఎకరాల భూమిలో దళితులతో వ్యవసాయం చేయించాడు. తద్వారా వచ్చిన పంటను దళితులకు పంచిపెట్టాడు. యువకుడిగా దైవ సేవకుడిగా ఖమ్మంలో ప్రజల ఆకలి బాధలను కడుపేదరికాన్ని వెట్టి చాకిరిని దగ్గరగా చూసి తన వంతుగా ఏదో సాయం అందించాలని నిర్ణయంతో అక్కడి నుండి క్రీస్తు శకం 1972 జూన్ నెలలో వరంగల్‌లోని స్టేషన్‌ఘన్‌పూర్ చేరుకున్నాడు. ప్రస్తుతం స్టేషన్ ఘనపూర్ జనగామలో భాగం అయినప్పటి ప్రజల పరిస్థితి అత్యంత దయనీయం. వారు పడుతున్న బాధను దుర్మార్గమైన వెట్టి చాకిరిని తరిమి కొట్టడానికి ఇటలీలోని తన స్నేహితులు సహాయంతో ఘనపూర్‌లో చేనేత పరిశ్రమను స్థాపించాడు. క్రీస్తు శకం 1975లో నిర్మల హ్యాండ్ క్రాఫ్ట్ ట్రైనింగ్ సెంటర్ పేరుతో చేనేత పరిశ్రమలు స్థాపించి చుట్టుప్రక్కల ఊర్లలోని బడుగు బలహీన వర్గాల మహిళలకు కుట్టుపని, ఎంబ్రాయిడరీ, లేస్, అల్లిక మొదలైనటువంటి నేర్పించి ఉపాధిని చూపించాడు. ఆ ప్రాంత యువకులకు ఆకులపై రంగులతో బొమ్మలు వేయడం వాటిని మార్కెట్ చేసుకోవడం, అలాగే తాపీ మేస్త్రి పని వంటివి నేర్పించాడు. వానలు ఎక్కువగా కురిసినప్పుడు గుడిసెలు తడిసి వాన నీళ్ళు ఇళ్ళలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారికి పక్కా ఇల్లు కట్టించాడు. చిన్నపిల్లలు కూలీలుగా పాలేరులుగా బర్లు, గొర్లు మేపుతుంటే వారికి చదువు అవసరాన్ని తెలిపి పిల్లల భవిష్యత్తుకు పాఠశాలలు నిర్మించాడు. ఇలా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి వేలాదిమంది నిరుపేద విద్యార్థులకు చదువు చెప్పిన గొప్ప విద్యావేత్త. క్రీస్తు శకం 1982లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ బహుళ ఔషధ చికిత్సను అందుబాటులోకి తెస్తూ తమ 20 సూత్రాల పరిపాలన పథకంలో కుష్టి వ్యాధి నిర్మూలన కూడా ఒక భాగంగా చేర్చారు.

మనదేశంలో పేదరికంతో పాటు అంటువ్యాధులు కూడా ఆనాడు ప్రజలపై పాలకుల పై ఇంతటి ప్రభావం చూపాయో దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. మన ఉమ్మడి రాష్ట్రంలో 1992లో ప్రతి 10,000 మంది జనాభాలో 127 మంది కుష్టి రోగులు ఉండేవారు. అప్పటికే 1980లోనే ఫాదర్ కొలంబో కుష్టి వ్యాధిగ్రస్తుల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ ప్రాంతాలతో 10 క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వందల సంఖ్యలో ప్రజలు వచ్చి ఆయా క్లినిక్లలో వైద్యం చేయించుకునేవారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరగడంతో వారికోసం శాశ్వతంగా పెద్దపెండ్యాల, కరుణాపురంలో 1983లో వైద్యశాలను కట్టించాడు. వారికి ఉచిత వసతి ఏర్పాటు చేశాడు. అలా రెండు, మూడు వందల మందికి నాణ్యమైన భోజనము, పాలు, గ్రుడ్లు, బట్టలు, దుప్పట్లు అందించాడు. కుష్టు వ్యాధులు ఉన్న చిన్న పిల్లల్ని చేరదీసి వారికి ప్రత్యేకంగా పాఠశాలను వసతిని ఏర్పాటు చేశాడు. అలాగే వ్యాధి నయమైన వారికి అనాటి ప్రభుత్వం సహాయముతో ఇండ్లు కట్టించాడు. ప్రతినెలా పెన్షన్ విధానాన్ని కూడా ఆయనే స్థాపించాడు. ఇప్పటికీ మన రాష్ట్రంలోని 16 జిల్లాల్లో కుష్టి వ్యాధిగ్రస్తులకు నెల నెలా పెన్షన్ ఇస్తున్నారు. ఫాతిమానగర్‌లో నవ దృష్టి పేరుతో ఉచిత కంటి పరీక్షలు మందులు ఇప్పటికీ అందిస్తున్నారు. తన సేవా ప్రయాణంలో ఎందరు అవమానించిన హింసించిన వారిని క్షమిస్తూ వచ్చారు. కులమతాలకు అతీతంగా తన 57 సంవత్సరాల గురు జీవితాన్ని దైవ సేవ కంటే అధికంగా, ప్రజాసేవకే అంకితం చేశారు. దళిత పీడిత తాడిత ప్రజలకు నాగరికత వైపు నడిపించిన గొప్ప సంస్కర్త. గతి తప్పిపోతున్న జీవితాలలో వెలుగులు నింపిన వెలుగు జ్యోతి.

దళిత, పీడిత, తాడితులను నాగరికత వైపు నడిపిన సంస్కర్త

కొలంబో ఆశయ సాధనకు పాటుపడాలి

స్వర్గీయ ఫాదర్ కొలంబో 14వ వర్ధంతి



(ఫైల్ ఫోటో)



అదే ఆయనకిచ్చే నిజమైన నివాళి

జీడి రమేష్, రీసెర్చ్ స్కాలర్
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్

ఖమ్మం, వరంగల్, నల్గొండ ప్రజలకు ప్రేమను పంచిన ప్రేమ మూర్తి. మంచినీ, మానవత్వాన్ని నేర్పిన దార్శనీకుడు నేడు ఫాదర్ కొలంబో వల్ల మా జీవితాలు బాగుపడ్డాయని వేలాది మంది చెప్పుకుంటారు.ఇలా ఎందరికో దారిచూపిన ధ్రువతార చాలా మంది మంచి మంచి పదవుల్లో అధికారులుగా, ఉపాధ్యాయులుగా, ఇం జనీర్లుగా వ్యాపారవేత్తలుగాజ్ మేధావులుగా, తయారు చేయబడ్డారు. కానీ తాము నడిచి వచ్చిన మార్గాన్ని మర్చిపోతున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఫాదర్ కొలంబో సేవ దృక్పథాన్ని జారవిడిచారు ఎప్పుడైతే సాటి మనిషికి సేవ చేస్తామో అప్పుడే ఫాదర్ కొలంబోకి మనం అనుచరులం అవుతాము. అదే ఆయనకు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి.

రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా మనోజ్ రెడ్డి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

జిల్లా రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా చిలుపూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కేశిరెడ్డి మనోజ్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు జి.బాలు యాదవ్ ప్రకటించారు. శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన సాగునీటి సాధన కమిటీ చైర్మన్, డైరీ ఫార్మ్ పౌల్ట్రీ ఫార్మ్, వ్యవసాయ రంగంలో అనుభవం కలిగిన వ్యక్తిగా ఆయనకు ఈ పదవి అందించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బాలు యాదవ్ తెలిపారు. రైతుల హక్కుల కోసం నిరంతరంగా పోరాటం చేసే శ్రామికుడు కావడం వల్లే, ఈ పదవికి వన్నె తెస్తాడని నమ్మకంతో ఈ స్థానం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ కేంద్రంలో మనోజ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. బాధ్యతగా ఈ పదవిని నిర్వహించి రైతులకు అండగా నిలుస్తానని అన్నారు.



కోలాట బృందానికి గజ్జల పంపిణీ



నవతెలంగాణ-చిన్నగూడూరు

మండల కేంద్రానికి చెందిన కోలాట బృందానికి గురువారం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ చేతుల మీదుగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, చెన్నయ్య, సర్పంచ్ మల్లయ్య వైస్ ఎంపీపీ వీరయ్యలు గజ్జల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో కోలాట నైపుణ్యాన్ని వెలికి తీసే విధంగా కృషి చేస్తున్న మహిళలను ప్రోత్సహించారు. తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోలాట బృందం నాయకురాలు వెంకటలక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మాటలకే పరిమితమైన గృహలక్ష్మి పథకం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్

నవతెలంగాణ-నరసింహులపేట

బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం అన్ని ఉట్టి మాటలే అని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరోజ్ రాజశేఖర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో గృహలక్ష్మి పథకం మొదలు పెట్టారని, ఈ పథకం వాళ్ల పార్టీ నాయకులకే వర్తింప చేస్తుందని ఆయన ఆరోపించారు. పేద ప్రజలకు ఇవ్వకుండా వాళ్లకు నచ్చిన వాళ్లకే అందుతుందని, డోర్నకల్ నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకంలో అంతా అవినీతే జరుగుతుందని అయన అన్నారు. లిక్కర్ టెండర్లకు నెలల పాటు సమయం ఉంటుంది కాని సంక్షేమానికి సమయం ఉండదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అర్హులైన నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్య శ్రీ, పించను వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు చేసిందని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



గిరిజన సంస్కృతికి ప్రతీక తీజ్

ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకర్ రావు

నవతెలంగాణ-పెద్దవంగర

గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకర్ రావు అన్నారు. మండలంలోని రాజమాన్ సింగ్ తండా, బావోజీ తండా, బీసీ తండాల్లో నిర్వహించిన బంజారా తీజ్ బతుకమ్మ ఉత్సవాలకు గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ మేరమ్మ చిత్రపటాలకు పూలమాలవేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరతరాలుగా లంబాడి ప్రజలు తమ సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తూ సుఖసంతోషాలతో, ఆరోగ్యాలతో ఉంచాలని, పెళ్లి కాని బంజారా ఆడబిడ్డలకు మంచి వరుడు దొరకాలని సేవాలాల్ మేరమ్మ దేవతలను కొలుచుకుంటూ జరుపుకునే పండుగ బతుకమ్మ తీజ్ ఉత్సవాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల పండగలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుగులోతు పటేల్ నాయక్, బానోత్ జమున గోపాల్, ధరావత్ పద్మ దేవేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, మండల సీనియర్ నాయకులు శ్రీరామ్ సుధీర్, బొమ్మెరబోయిన రాజు, రాంపాక మనోజ్, పూణ్య నాయక్, వెల్మ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టకు ఆహ్వాన పత్రాల పంపిణీ



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

ఈనెల 4వ తారీఖున పాలకుర్తి వాల్మీడీలో జరగబోయే సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమానికి మండలంలోని వెంకటాపురం గ్రామంలో స్థానిక సర్పంచ్ శీలం లింగన్న గౌడ్ ఇంటింటికి తిరిగి ఆహ్వాన కరపత్రాలు పంచి గ్రామ ప్రజలను ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావు ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రజలందరికీ ఆహ్వానం కరపత్రాలు పంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు అంకుస్, గ్రామ ఇన్చార్జి ఇమ్మడి రమణ, ఉప సర్పంచ్ రవి, పార్టీ అధ్యక్షులు బోలగాని శ్రీనివాస్ గౌడ్ వార్డు సభ్యులు బోలగాని లలితా మల్లేష్, సోమనరసమ్మ, భాస్కర్, మహేష్, మాజీ సర్పంచ్ శీలం వెంకన్న గౌడ్, గ్రామ పార్టీ నాయకులు పోరెడ్డి వీరారెడ్డి, పిచ్చిరెడ్డి, మహేష్, ఐలయ్య, యాకన్న, మహిళా సంఘాల సీసీ రేణుక వివోఏలు రజిత, కవిత ఫీల్డ్ అసిస్టెంట్ ఉమా, మహిళా సంఘ సభ్యులు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కొండపల్లి రామచంద్రరావు



నవతెలంగాణ-నెల్లికుదురు

ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు కొండపల్లి రామచంద్రరావు అన్నారు. మండలంలోని తారసింగ్ బావి గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు అజ్మీర సోమన్న ఇటీవల అనారోగ్యానికి గురైనందుకు మహబూబాద్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్య సునీత మంగీలాలతో కలిసి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలోని గ్రామాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులే ఉన్నాయని, రాబోయె టీడీపీ హాయాంలోనే ప్రజలందరూ అన్ని రంగాల వర్గ ప్రజలు ఎంతో అభివృద్ధి చెందారన్నారు. మళ్ళీ పూర్తి స్థాయిలో తెలంగాణ అభివృద్ధి చెందాలంటే అది కేవలం టీడీపీతోనే సాధ్యమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుల నాయకత్వంలో తెలంగాణలో జరుగు ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగానే పోటి చెస్తుందని తెలిపారు.టీడీపీ మండల సమావేశాలు ఈ నెల 6న నెల్లికుదురు మండల సమావేశం, 7న కేసముద్రం, ఇనుగుర్తి మండల సమావేశం, కేసముద్రంలో 8న గూడూరు మండల సమావేశం, 10నమహబూబాబాద్ నియెజకవర్గ సమావేశం మహబూబాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఎల్లయ్య, కేసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు పరశుబోయిన ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు బాధితుడికి అప్పగింత

నవతెలంగాణ-గార్ల

నగదు పోగొట్టుకున్న ఓబాధితుడుకి విచారణ జరిపి నగదు అప్పగించిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్త పోచారం గ్రామానికి చెందిన బిక్షమయ్య అనే వ్యక్తి ఈ నెల 17వ తేదీన 9 వేల రూపాయల నగదును పోగొట్టు కోవడం జరిగిందని తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన కొందరు యువకులకు పోయిన నగదు దొరకగా దొరికిన నగదును యువకులు స్థానిక పోలీసు స్టేషనులో అప్పగించగా విచారణ జరిపిన పోలీసులు నగదు పోగొట్టుకున్న బాధితుడైన బిక్షమయ్యకు గురువారం నగదును అందించారు. దొరికిన డబ్బులను సొంత ఖర్చులకు ఉపయోగించు కోకుండ నిజాయితీగా పోలీసులకు అప్పగించిన యువతను ఎస్సై బానోత్ వెంకన్న అభినందించారు.



ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు





నవతెలంగాణ-మహబూబాబాద్

సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాఖీ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ రాఖీ పండుగ వేడుకలలో చిన్నారులు పాల్గొని జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ డేవిడ్ జిల్లా అధికారులకు రాఖీలు కట్టి స్వీట్స్ తినిపించి దీవెనలు పొందారు. జిల్లా మహిళ అధికారులు జిల్లా పంచాయతీ అధికారి నర్మద, డిడబ్ల్యూఓ హైమావతి, సిడిపిఓ డెబోరా, సఖి సెంటర్ అధికారి శ్రావణి, ఈశ్వరి బ్రహ్మ కుమారి సమాజం మహిళా ప్రతినిధులు పలు మహిళా అధికారులు కలెక్టర్‌కు రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు రక్షణగా నిలవాలనే గొప్ప ఉద్దేశ్యంతో రాఖీ పండుగ ఏర్పాటు చేయడం జరిగిందని, తద్వారా అన్నా చెల్లెలు బంధంతో రుణం తీర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా సమాజం సంస్కృతి, సంప్రదయాలతో విలసిల్లు తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ నాగవాణి, మహిళ శిశు సంక్షేమ అధికారి హైమావతి, వ్యవసాయ శాఖ అధికారి చత్రు నాయక్, ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, ఉపాధి కల్పన అధికారి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు రాఖీ కట్టిన సోదరీ కౌసల్య

మరిపెడ : మరిపెడలో రాఖీ పౌర్ణమిని అన్నదమ్ముల అక్క చెల్లెల అనుబంధాన్ని తెలియజేస్తూ అత్యంత వైభవంగా మహిళలు రాఖీలు కట్టి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్వగ్రామం ఉగ్గంపల్లిలో ఆయన సోదరీమణి కౌసల్య ఎమ్మెల్యే రెడ్యా నాయక్‌కు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇదే క్రమంలో మహబూబాబాద్ పార్లమెంటు సభ్యురాలు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డిఎస్ రవిచంద్రకు రాఖీ కట్టింది. ఎల్లంపేట బీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు తేజావత్ శారద రవీందర్ నాయక్‌లు రవిచంద్రకు రాఖీలు కట్టారు. కాగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

హిందూ ముస్లీంల ఐక్యతను చాటుతూ రాఖీ వేడుకలు

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 5వ వార్డులో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ లతీఫ్ అధ్వర్యంలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని హిందువు సోదరులకు మైనార్టీ మహిళలు రాఖీ కట్టి వారి ఆశీర్వచనం తీసుకున్నారు. హిందూ ముస్లింలు ఐక్యతను చాటుతూ చేపట్టిన రాఖీ వేడుకలు సంబరంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ కౌన్సిలర్ పానుగోతు సుజాత వెంకన్నకో అప్షన్ సభ్యులు మక్సుద్, ఖైరున్ హుస్సేన్, మాచర్ల స్రవంతి భద్రయ్య, రేఖ లలిత వెంకటేశ్వర్లు, యాకూబ్ పాష, ఫైజ్ ఖాన్, జాకీర్ హుస్సేన్, ఖాజ, ఫకద్దున్, వాజిద్, నరసింహ రెడ్డి, బషీద్ ఖాన్, యాకూబ్ అలీ, అన్వరి, స్వాతి, జైనబు, సాదియ, వజియ, కషు, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహులపేట : మండలంలోని అన్ని గ్రామాలు, తండాల్లో గురువారం ఘనంగా రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. రాఖీ పండుగ వేడుకల సందర్భంగా అన్న తమ్మునికి అక్క చెల్లెలు రాఖీ కట్టి వేడుకలు నిర్వహించారు. రాఖీ ఈ పేరు వినగానే అందరికీ గుర్తుకొచ్చేది అన్నా-చెల్లెల పండుగ. సమాజంలో స్త్రీకి రక్షణగా నిలిచి, వారిని గౌరవించే తత్వాన్ని ఇంటి నుంచే అలవాటు చేసే ఒక గొప్ప సంప్రదాయానికి ప్రతీక రాఖీ పౌర్ణమి. మనతో పేగుబంధం పంచుకొని పుట్టిన అక్కాచెల్లిళ్లకే కాదు.. మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సోదరికీ అండగా నిలవడం మన కర్తవ్యం అని మన విశిష్టమైన సంస్కృతి చెబుతోంది. సాధారణంగా ఈ పండుగను చంద్రమాన క్యాలెండర్ ప్రకారం శ్రావణమాసంలో చేస్తారు. సోదరుడు తనకు రక్షగా ఉండాలని, తాను అన్నకు జీవితాంతం తోడుగా ఉండాలని కోరుకుంటుంది. ఆరోజు ఎక్కడ ఉన్నా.. అన్నయ్య/తమ్ముడిని చేరుకుని రాఖీ కడుతుందని శివాలయం అర్చకులు దేవేందర్ శర్మ తెలిపారు.

ఇనుగుర్తి గురుకులంలో రాఖీ వేడుకలు...

ఇనుగుర్తి : సోదరులు సోదరీమణులు ఎంతో ప్రేమ ఆప్యాయలతో జరుపుకునే పండగ రాఖీ పౌర్ణమి అనుబంధాలను కలుపుకొని తోబుట్టువులను ఆయు ఆరోగ్యాలతో నిండు నూరేళ్ల కలకాలం వర్ధిల్లాలని తమ తోబుట్టులకు రాఖీ కట్టి వారిని దీవిస్తారు. పవిత్రమైన పండగకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ఇవ్వకపోవడంతో ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న బాలికల అన్నదమ్ములు రాఖీలు కట్టించుకోవడం కోసం, సుదూర ప్రాంతం నుంచి తమ అక్కలు, చెల్లెలు చదువుకుంటున్న ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు నేడు గురువారం వచ్చి తమ అక్కలు చెల్లెలితో రాఖీలు కట్టించుకున్నారు. దీనితో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వచ్చే రాఖీ పౌర్ణమి పండక్కి సెలవు ప్రకటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.









రక్షాబంధన్.. అన్నాచెల్లెళ్ల అనురాగ బంధం!

పెద్దవంగర : అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్. ఈ వేడుకలను గురువారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరి మణులు తమ సోదరులకు రాఖీలు కట్టి అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.

మండలంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

గార్ల : మండలంలోని పలు గ్రామాలలో గురువారం రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తమ ఇండ్లలో ఉన్న సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు.వివిధగ్రామాలు,పట్టణాల నుండి తమ సోదరులకు రాఖీలు కట్టడానికి వచ్చిన అక్క చెల్లెళ్ళు, అన్న తమ్ములతో గ్రామాలు కళ కలకలలాడాయి.ఏం ఇంట్లో చూసిన రాఖీ పండుగ సందడే కనిపించాయి.

ఓటర్లు తమ ఓటు హక్కును పరిశీలించుకోవాలి

జిల్లా కలెక్టర్ శశాంక

నవతెలంగాణ-మహబూబాబాద్

ఓటర్లు తమ ఓటు హక్కును పరిశీలించుకునేందుకు పోలింగ్ కేంద్రాలలో ఓటర్ లిస్టును ప్రదర్శించడం జరుగుతున్నదని తప్పనిసరిగా ఓటు హక్కును పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక కోరారు. గురువారం ఐడిఓసిలోని కలెక్టర్ సమావేశం మందిరంలో ఎలక్ట్రోరల్ రోల్ పై ఏఆర్ఓలు, ఏఈఆర్వోలు, ఎంపీడీవోలు, బీఎల్వో సూపర్వైజర్లతో కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కు నమోదైందా..? లేదా..? అన్నది పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించిన లిస్టులో చూసుకోవాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో 20 మంది వరకు 18 సంవత్సరముల యువ ఓటర్లు తప్పనిసరిగా ఉంటారని, సెప్టెంబర్ 2,3 తేదీలలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులను విస్తృతంగా ప్రచారం చేసి నమోదు చేయాలన్నారు. దివ్యాంగుల ఓటర్లను కూడా ప్రతి గ్రామంలో ఉంటారని ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న దివ్యాంగులను గుర్తించి మార్కింగ్ చేపట్టాలన్నారు. స్వీప్ ఈ కార్యక్రమాలను బ్యానర్లు ముద్రించి విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. అధికారులు ప్రతీరోజు ఒక కళాశాలలో కార్యక్రమం చేపట్టాలని ఓటుహక్కు విశిష్టతను తెలియజేస్తూ 18 సంవత్సరాల యువత ఓటు హక్కు వినియోగించుకునేలా నమోదు చేయాలన్నారు. యువతతో లిట్రసి క్లబ్‌లో ఏర్పాటు చేయించాలని ఓటు ఆవశ్యకతపై చర్చించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 5 తేదీన ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించాలని డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్యకు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై గ్రామాలలో విస్తృత ప్రచారం చేయించాలని ఓటు హక్కు తీరును తెలుసుకునేందుకు వివి ప్యాట్‌ల ద్వారా ఓటు వేయించాలని డిపిఓకు సూచించారు.ప్రత్యేక ఓటర్ నమోదుకు ఏర్పాటుచేసిన క్యాంపులలో వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్ డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్యా, జిల్లా పంచాయతీ అధికారి నర్మదా, ఆర్‌డిఓ నరసింహారావు తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల పట్ల వివక్షత తగదు



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పట్ల వివక్ష తగదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జింజిరాల నాగరాజు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌లో భాగంగా సెకండరీ గ్రేడ్‌ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు టీ, స్నాక్స్, భోజన పరిస్థితి కల్పించకపోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే ట్రైనింగ్ తీసుకున్నతీసుకుంటున్న స్కూల్‌అసిస్టెంట్లు, పండిట్లకు టీ, స్నాక్స్, భోజన వసతి కల్పిస్తూ స్వాగతిస్తున్నారని ఇది సరికాదని, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు మధ్య వివక్ష చూపడం సరికాదని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ తీసుకున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు 1000 చొప్పున అందించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని జంజిరాల నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు.

వైన్స్‌లను తలపిస్తున్న బెల్ట్ షాపులు

సమాచారం చేరవేసిన పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

మద్యానికి బానిసవుతున్న యువకులు, పేద కుటుంబాలు

బెల్ట్ షాపుల కట్టడిపై చర్యలు శూన్యం

అప్పుల్లో కూరుకు పోతున్నాం అంటున్న మహిళలు



నవతెలంగాణ-నరసింహులపేట

అమ్మకాలు కొనసాగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు పట్టించు కోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయని తద్వారా ప్రజలు నష్టపోతున్నారని తెలిసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలోని ప్రజలు రోజంతా కాయకష్టం చేసుకుని వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో గ్రామాల్లో బెల్ట్ షాపులు ప్రవేశించి వారి కుటుంబాలలో చిచ్చు పెడుతున్నాయి. కుటుంబంలోని పురుషులు గ్రామంలోనే మద్యం లభించడంతో మద్యానికి బానిసై రోజంతా పని చేయగా వచ్చిన కూలీ డబ్బులను మద్యానికి ఖర్చు చేయడంతో కొన్ని కుటుంబాలు రాత్రి పూట పస్తులు వుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నరసింహులపేట మండలంలోని గ్రామంలో సుమారు వారం రోజులు క్రితం యువకుడు మద్యానికి బానిసై మద్యం తాగడానికి డబ్బులు లేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి వచ్చిన పట్టించుకోలేదని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు బీద మధ్యతరగతి ప్రజల ధనప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మేధావి వర్గం పేర్కొంటుంది. ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు ఎక్కడ ఉన్నారో..? అని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

బెల్ట్ దుకాణాల కట్టడి ఎక్కడ..?

మండలంలోని అన్ని గ్రామాలలో సుమారు 600 బెల్ట్ షాపులు ఉన్నాయి. గ్రామాలలో బెల్ట్ షాప్‌ల ద్వారా అనాధికారికంగా మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఎక్సైజ్ శాఖ మద్యం టార్గెట్ నింపుకోవడానికి వైన్ షాపులను ప్రోత్సహిస్తూ అందులో భాగంగానే గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మాదృష్టికి రాలేదు : భాస్కర్, ఎక్సైజ్ సీఐ, తొర్రూర్

ఎక్సైజ్ శాఖ డి.భాస్కర్ వివరణ కోరగా మండలంలో బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామని, నేను వచ్చి రెండు నెలలు అవుతుంది కాబట్టి మండలంలో బెల్ట్ షాపులు ఉన్న సంగతి మా దృష్టికి ఇంతవరకు రాలేదు. త్వరలో బెల్ట్ షాపులపైచర్యలు తీసుకుంటామని సీఐ భాస్కర్ తెలిపారు.

రహదారి విస్తరణ పనులు...

త్వరితగతిన చేపట్టాలి

జిల్లా కలెక్టర్ శశాంక

నవతెలంగాణ-మహబూబాబాద్

మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా ఈదులపూసపల్లి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం ఐడిఓసిలోని కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 5 కోట్లతో రహదారి విస్తరణ 7 పనులు చేపడుతున్నందున పనులు వేగవంతంగా ఉండాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సెంటర్ డివైడర్ పనులు చేపట్టాలని పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలన్నారు. విస్తరణలో భాగంగా ఫారెస్ట్ ఆఫీస్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆఫీస్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్టీ బాలికల హాస్టల్ ఎన్టీఆర్ స్టేడియం విస్తరణకు గురి అవుతున్నందున సంబంధిత కార్యాలయాల ప్రహరీ గోడలను త్వరపడి తొలగించకుండా ఆ శాఖల ప్రహరీ గోడలకు నిధులు మంజూరు అయిన తర్వాతనే తొలగింపు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి సురేష్, బీసీ సంక్షేమ అధికారి నరసింహస్వామి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, జిల్లా క్రీడల అధికారి అనిల్ కుమార్, మున్సిపల్ డిఈ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంజేఎఫ్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఏంపెల్లి ముతేష్

నవతెలంగాణ- ములుగు



ఎంజేఎఫ్ (మాదిగ జర్నలిస్టుల ఫోరమ్) ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఏంపెల్లి ముతేష్ ను నియమించినట్లు ఎంజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రవి నియామక పత్రాన్ని అందజేశారు. గురువారం ఏం పెల్లి ముతేష్ విలేకర్లతో మాట్లాడారు. మారుమూల ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన తనను ములుగు జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు తిప్పరపు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్, రాష్ట్ర కార్యదర్శి చుంచు రవికి కతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం కొనసాగుతున్న ఉద్యమంలో ఎస్సీ జర్నలిస్టులు భాగస్వాములయ్యేలా, వారికి సంక్షేమ పథకా అందేలా కషి చేస్తానని అన్నారు.

ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎంపీపీ

నవతెలంగాణ-మల్హర్‌రావు



ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు మండల ఎంపిపి చింతలపల్లి మలహల్ రావు, మండల తహసీల్దార్ శ్రీనివాస్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించెందుకు ప్రభుత్వం జివో నెంబర్లు 58,59 జీవోలను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండలంలో నాచారం గ్రామపరిదిలోని తాడ్వాయికి చెందిన 25మంది లబ్ధిదారులకు మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సరితా, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ లోకి 'రామసహాయం'

అభిమానులతో ఆత్మీయ సమ్మేళనాలు ... బీఆర్ఎస్ మంత్రులతో చర్చలు

నవతెలంగాణ -తాడ్వాయి



వైఎస్సార్‌టీపీ ములుగు జిల్లా అధ్యక్షులు, తాడ్వాయి మండల మాజీ జెడ్పీటీసీ, సీనియర్ రాజకీయ నాయకుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి వైఎస్సార్‌టీపీ స్తబ్ధుగా ఉండడంతో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈ క్రమంలో 30-8-2023(బుధవారం)న జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ఆయనే స్వయంగా ప్రకటిం చారు. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు రామసహాయం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి చర్చించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. ములుగు జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్య కర్తలు, ముఖ్యులతో కలిసి విస్తతంగా పర్యటించి, సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయం మేరకు బీఆర్ఎస్‌లో చేరనునట్లు ప్రకటించారు.

ములుగు జిల్లా వ్యాప్తంగా రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం. 1995 నుండి 2000 వరకు తాడ్వాయి సింగిల్ విండో ఛైర్మన్‌గా, 2001 నుండి 2006 వరకు తాడ్వాయి జెడ్పీటీసీగా, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా విధులు నిర్వహించారు. వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడిగా రెండేండ్ల నుండి విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఏజెన్సీ, ఆదివాసీ ప్రాంతాల్లో బలమైన సంబంధాలు ఉన్న నాయకుడిగా, ఆదివాసి గిరిజనుల పక్షపాతిగా పేరుపొందారు. భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు అత్యంత సన్నిహితుడుగా ప్రశంసలందుకున్నారు. ములుగు నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలతో ముఖ్యంగా ఆదివాసి సామాజిక వర్గంలో బలమైన సంబంధాలు కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఇలాంటి ప్రజా నాయకుడు రామసహాయం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు చెప్పడంతో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. త్వరలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్, సత్యవతి రాథోడ్, ములుగు బీఆర్ఎస్ టికెట్ అభ్యర్థి, ములుగు జెడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో చేరన్నట్లు తెలిసింది. కాగా గురువారం హైదరాబాద్‌లో మంత్రుల సమక్షంలో చర్చలు జరిపినట్టు విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ లోకి చేరి ప్రజలకు నిరంతరం సేవలందించాలని, సంక్షేమ పథకాలు అందేలే కషి చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి

ప్రొక్లైనర్, లారీ దగ్ధం

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి ప్రొక్లైనర్, లారీ దగ్ధం

ప్రమాదవశాత్తు 11-కేవీ విద్యుత్ వైర్లు తగిలి ప్రొక్లైనర్, లారీ తగలబడి దగ్ధమైన సంఘటన మండలంలోని రామన్నగూడెం పప్కాపురం కరకట్ట వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కష్ణ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... రామన్నగూడెం వద్ద కరకట్ట పనులు ముగించుకొని హైదరాబాద్‌కు లారీలో ప్రొక్లైనర్‌ను తీసుకెళ్తున్నారు. ప్రమాదవశాత్తు కరకట్ట వద్ద ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలి మంటలు వ్యాపించాయి. గమనించిన యజమాని శ్రీనివాస్, డ్రైవర్ వెంకటేష్ బయటకు దిగి పరుగులు తీశారు. లారీ, ప్రొక్లైనర్ దగ్ధమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎస్సై కష్ణ ప్రసాద్ తెలిపారు.

మావోయిస్టు కరపత్రాల కలకలం అవాస్తవం

నవతెలంగాణ-వాజేడు

వాజేడు మండలం జగన్నాథపురం జంక్షన్ వద్ద 29వ తేదిన మావోయిస్ట్ కరపత్రాలు పడ్డాయనే వచ్చిన వార్తలో వాస్తవం లేదని, ఎవరో కావాలనే తప్పుడు సమాచారమిచ్చారని పోలీసులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచురించి ప్రజల్లో భయం కలిగించడం సరికాదన్నారు. ఎవరికైనా అటువంటి సమాచారం తెలిస్తే, పూర్తి వివరాలు సేకరించిన తరువాతనే ప్రచురించాలని తెలిపారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

సెకండ్ ఏఎన్ఎంలు

నవతెలంగాణ - ములుగు



జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ సెంటరల్ సెకండ్ ఏఎన్ఎంల సమ్మె కొనసాగుతోంది. గురువారం రక్షాబంధన్ సందర్భంగా డీఎంహెచ్ఓ అల్లం అప్పయ్యకు సెకండ్ ఏఎన్ఎంలు రాఖీ కట్టి వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులకు కూడా రాఖీ కట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాయం సరోజన, కోడి సుజాత పాల్గొని మాట్లాడారు. తమ సర్వీస్‌ను దష్టిలో పెట్టుకుని రెగ్యులర్ చేయాలని కోరారు. షోకాజ్ నోటీసులు పంపించినప్పటికీ తాము రెగ్యులర్ చేసేవరకు సమ్మె విరమించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బండి నరసయ్య, ఏఐటీయూసీ నాయకులు జేరిపోతుల పైడి బాబు, ముత్యాల రాజు, సోమలక్ష్మి, సులోచన, ఆదిలక్ష్మి, పావని, లక్ష్మి, సోమలక్ష్మి ,సరిత, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - కాటారం



కాటారం మండల కేంద్రంలో గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పర్యటించారు. ఐటీఐ కళాశాలను సందర్శించి విద్యార్థుల మౌళిక సౌకర్యాల కోసం మంజూరు చేసిన నిధులను సత్వరమే వినియోగించి కళాశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, తదితర పనులు పూర్తిచేయాలని పంచాయితీ రాజ్ అధికారులను ఆదేశించారు. కళాశాల విద్యార్థుల సంఖ్య పెరిగేలా సమీప మండలాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా కషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను సందర్శించారు. రెవెన్యూ డివిజన్ నేపథ్యంలో ప్రజలకు సేవలందించడానికి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను వినియోగించడానికి సిద్ధం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యలయాన్ని సందర్శించి కాటారంలోని 501 సర్వే నెంబర్‌లో సర్వే నిర్వహించి అరుహులైన వారికి పట్టాలు పంపిణీ మాదిరిగా సుందర్ రాజ్ పేట లోని 91 సర్వే నెంబర్ భూమిని మోకా సర్వే చేసి గ్రామ సభ నిర్వహించి అర్హులైన వారికి పట్టాల పంపిణీ చేపట్టాలని తహసీల్దార్ నాగరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ జనార్ధన్, ఆర్అండ్‌బీ డీఈ సాయిలు, ఏఈ అశోక్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న రెవెన్యూ డివిజన్ సాధన దీక్ష

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు గురువారం కొనసాగాయి. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు, కోకన్వీనర్ గడ్డం స్వామి సీనియర్ పాత్రికేయులు గుజేటి శ్రీనివాస్ జోడు మహేందర్, జోడు సంతోష్, గడ్డం సమ్మయ్య, జోడు మహేష్, బొల్లా వెంకట్ స్వామి, వెన్నెల కార్తీక్, కమ్మరి సమ్మయ్య, గడ్డం తిరుపతి, చింతకింది విజయ్, నెన్నల శేఖర్, కోఆర్డినటర్ బెల్లంపల్లి సురేశ్, కన్వీనర్ మోటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానాలు పాటించాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్

నవతెలంగాణ-గణపురం



రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ ఆధ్వర్యంలో రైతుల పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు, వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మిరప నారు మళ్లలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. హైదరాబాద్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ వారు రూపొందించిన మినీ భూసార పరీక్ష కిట్ ద్వారా పరుశరాంపల్లి గ్రామంలో భూసార పరీక్ష ఆవశ్యకతపై రైతులకు శిక్షణ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నేలలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పొందే అవకాశం ఉందని అన్నారు. విధిగా రైతులు నేల పరీక్షలు చేపించి పోషక లోపాలు సరిచేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐలయ్య, విస్తరణ అధికారి ప్రణయ్, మౌనిక, రైతులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు

జెడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగ జ్యోతి

నవతెలంగాణ-ములుగు



సోదరీసోదరుల అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జెడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆమె స్వగహంలో పార్టీ శ్రేణులు, సిబ్బంది, కుటుంబ సభ్యులతో కులమతాలకతీతంగా రాఖీ పండుగ జరుపుకున్నారు. భారతీయ సంస్కతికి, జీవనతాత్వికతకు రాఖీ పండుగ వేదికగా నిలుస్తుందన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. రాఖీ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి : ఎస్సై తిప్పాని వెంకటేశ్వర్

నవతెలంగాణ- ములుగు



సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని ఎస్సై తిప్పాని వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయినిగూడెం గ్రామ ఎస్సీ కాలనీలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిచినట్లు మాట్లాడితే చట్ట ప్రకారం శిక్ష అర్హులవుతారని అన్నారు. ప్రతి నెలా చివరి రోజున గ్రామాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

దానా బస్తాలు వితరణ

నవతెలంగాణ-గణపురం



కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు స్టేషన్‌ఘన్‌పూర్ ఇప్పగూడెం గ్రామానికి చెందిన సట్ల శ్రీనివాస్‌గౌడ్, జ్ఞాపకార్థం ఆయన సతీమణి సట్ల సుజాత, నల్లబెల్లి మండలం ముంచింపుల గ్రామానికి చెందిన మాదాసి వాసవి శేఖర్‌గౌడ్ దంపతులు గురువారం దానా బస్తాలు అందజేశారు. గోశాలకు దానా బస్తాలు అందజేసిన సుజాత, వాసవి శేఖర్ గౌడ్ దంపతులకు కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ ప్రత్యేక కతజ్ఞతలు తెలిపింది. అర్చకులు నరేష్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేవంత్‌రెడ్డికి రాఖీ పండుగ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క

నవతెలంగాణ -ములుగు



టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో రేవంతర్‌రెడ్డికి రాఖీ కట్టారు. అంతకుముందు ములుగు జిల్లాలోని వివిధ నాయకులకు సీతక్క రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రులను కలిసిన 'లక్ష్మణ్‌బాబు'

నవతెలంగాణ - ములుగు

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కాకులమర్రి లక్ష్మీనరసింహారావు(లక్ష్మణ్‌బాబు) ములుగు జెడ్పీ ఛైర్‌పర్సన్, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతితో కలిసి గురువారం ప్రగతిభవన్‌లో మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్‌రావునుని మంత్రి హరీష్‌రావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందని అన్నారు. వారి వెంట జిల్లా నాయకులు ఉన్నారు.

మచ్చాపూర్‌లో ఘనంగా 'సివిల్ రైట్స్ డే'

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో గురువారం జాతీయ పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ కాలనీలో తహసీల్దార్ అల్లం రాజకుమార్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, వివక్షకు తావులేకుండా జీవించాలని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరుల హక్కులను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. పస్రా ఎస్సై షేక్ మస్తాన్ మాట్లాడుతూ ప్రజలు అంటరానితనం, కుల వివక్ష విడనాడాలని అన్నారు. ఎవరైనా వివక్షకు గురైనా, వారి హక్కులకు భంగం కలిగించినా కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఎంపీడీవో... హక్కులకు ఎవరు భంగం కలిగించకుండా సమ సమాజంగా జీవించడమే అందరి ముందున్న లక్ష్యమని అన్నారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

బాధితురాలుకు పోలీసుల అండ

రూ.25,000 చెక్కు అందజేత : సీఐ బండారి కుమార్

నవతెలంగాణ-వెంకటాపురం

కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ముద్దులగూడెం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ పండ కుమారి కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలో వైద్యం చేయించుకోవడం భారంగా మారింది. విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యమకారులు, న్యాయవాది, రచయిత చిడెం రవికుమార్ వెంకటాపురం సీఐ బండారి కుమార్‌కు వివరించారు. ఆయన వెంటనే స్పందించి రూ.25000 ఆర్థికసాయం స్థానిక పోలీస్టేషన్‌లో గురువారం అందజేసి శెభాష్ అనిపించుకున్నారు. పోలీసులు సాయంలోనూ ముందుంటారు అని సీఐ బండారి కుమార్ నిరూపించారు.

విద్యుద్ఘాతంతో గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ - కాటారం

విద్యుద్ఘాతంతో గడ్డివాము దగ్ధమైన ఘటన మండల పరిధి ధర్మసాగర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ గ్రామానికి చెందిన రైతు కోరబోయిన లచ్చయ్య గేదెలకు పశుగ్రాసం కోసం ఇంటి సమీపంలో గడ్డివాము ఏర్పాటు చేసుకున్నారు. కాగా లచ్చయ్య ఇంటి మీదున్న విద్యుత్ తీగలు గడ్డికి తగిలి మంటలు చెలరేగాయి. ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచ్ మదారి అనూష రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కోడూరి మధు ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ ఘటనాస్థలికి చేరుకోగా మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సుమారు రూ.30వేల విలువైన గడ్డి దగ్ధమైంది. ప్రభుత్వ పరంగా బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని సర్పంచ్, గ్రామస్తులు అధికారులకు విన్నవించారు.

గ్రామీణ వైద్యుడిపై దాడి హేయమైన చర్య

ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్

నవతెలంగాణ-మల్హర్‌రావు



గ్రామీణ విద్యుడిపై దాడి హేయమైన చర్య అని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన తాడిచెర్లలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో మధ్యాహ్నం భోజనానికి వెళుతున్న గ్రామీణ వైద్యుడు నాగేశ్వరరావుపై కొందరు దుండగులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లుతెలిపారు. ఆర్ఎంపీ వైద్యం దినదిన గండంగా మారిందని అన్నారు. దాడికి పాల్పడిన దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు 60ఏండ్లకు పైబడి గ్రామాల్లో గ్రామీణ వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటూ నిరుపేద ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. వారిని గుర్తించిన వైఎస్ఆర్ పారా మెడికల్ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 104 వాహనాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగాల కల్పనకు కషి చేశారని అన్నారు. ఆయన మరణానంతరం శిక్షణా తరగతులు ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ముడుతనపల్లి ప్రభాకర్, మండల కోశాధికారి చొప్పరి రాజయ్య, సీనియర్ గ్రామీణ వైద్యుడు బండి సుధాకర్ పాల్గొన్నారు.

సేఫ్టీ లాకర్స్ ఏర్పాటు చేయాలి

డీవై సీఎంఓకు సీఐటీయూ వినతి

నవతెలంగాణ-భూపాలపల్లి డెస్క్



భూపాలపల్లి జయశంకర్ జిల్లా కేంద్రం లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న 30 మంది వార్డ్ అసిస్టెంట్లకుగాను సేఫ్టీ లాకర్స్, డైనింగ్ టేబుల్స్, బాత్ రూం సౌకర్యం కల్పించాలని గురువారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆస్పత్రి డీవై సీఎంఓ డాక్టర్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య, రాష్ట్ర నాయకురాలు పోతుగంటి శ్వేత మాట్లాడుతూ... కొన్నేండ్లుగా నిర్వహిస్తున్న వార్డ్ అసిస్టెంట్లకు దుస్తులు మార్చుకునే ప్రత్యేక వసతి, బాత్రూం సౌకర్యం, భోజనం చేయడానికి డైనింగ్ టేబుల్, కుర్చీలు, వారికి సంబంధించిన వస్తువులు పెట్టుకోవడానికి లాకర్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం చొరవ తీసుకొని ఐరన్ సేఫ్టీ లాకర్స్‌తో పాటు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ స్పెషల్ అసిస్టెంట్ ఏజెంట్ మరియు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్, మొబైల్ కోర్టు, భద్రాచలం.
ఒ.యస్. నెం. 205/2023

బిట్వీన్ :
సురిటి వేణుగోపాల్ ....వాది
మరియు
ఎవరికి సంబంధించినచో వారికి ...ప్రతివాదులు

యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. సురిటి రామ్మూర్తి, తండ్రి : లేటు సురిటి అచ్చయ్య గారికి పిటిషనర్ తన అన్న గారి ఏకైక కుమారుడు సురిటి రామ్మూర్తి లేటు తండ్రి లేటు సురిటి అచ్చయ్య గారు అవివాహితుడుగా చీకుపల్లి గ్రామం, వాజేడు మండలం, ములుగు జిల్లా ది. 22.04.2022 నాడు మరణించినారు. సురిటి రామ్మూర్తి గారి పేరున స్థిరాస్తులైన వ్యవసాయ భూములు పాస్‌బుక్ నెం. టి2420032042 ఖాతా నెం. 60047 నందు. (1) సర్వే నెం. 29/1/2 విస్తీర్ణం : ఎ. 0.1940 సెంట్లు (2) సర్వే నెం. 28/1/2 విస్తీర్ణం : ఎ.1.3500 సెంట్లు (3) సర్వే నెం. 27/156/2 విస్తీర్ణం ఎ. 0.0640 సెంట్లు గల భూములు చీకుపల్లి(జెడ్), రెవెన్యూ గ్రామం, వాజేడు మండలం, ములుగు జిల్లా మరియు పాస్ బుక్ నెం. టి24200280117, ఖాతా నెం. 214 నందు సర్వే నెం. 75/3 విస్తీర్ణం ఎ. 2.0720 సెంట్లు గల భూమి కోయ వీరాపురం (జె) రెవెన్యూ గ్రామం, వాజేడు మండలం, ములుగు జిల్లా నందు కలదు. సురిటి రామ్మూర్తి గారి బ్యాంక్ అకౌంట్ నెం. 73016194166 (ఏపిజివిబి) బ్రాంచ్ వాజేడు నాగారం నందు రూపాయలు 1 లక్ష ఆపై అతని ఖాతా నందు కలవు. పైన పేర్కొనబడిన వ్యవసాయ భూములను వాది తన పేరున మార్చుకొనుటకు మరియు బ్యాంక్ నుండి నగదు విడుదలకు వారసత్వం కొరకు వారసునిగా ప్రకటించుటకు దావా ఒ.ఎస్. నెం. 205/2023 దాఖలు చేసి ఉన్నారు. అట్టి విషయంలో ఎవరికైనా ఎట్టి అక్షేపణలు గానీ అభ్యంతరాలు గాని ఉన్న యెడల ది. 14.09.2023న ఉ.గం. 10.30 ని॥లకు పై కోర్టు నందు స్వయంగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గానీ అభ్యంతరములు తెలియజేసుకొనవచ్చును. లేనిచో కోర్టు వారి వాదిని వారసునిగా సర్టిఫికెట్ మంజూరు చేయబడును.

//కోర్టు వారి అనుమతితో//

భద్రాచలం.
ది.31.08.2023

చీమల నరసింహారావు
చందా హనుమంతరావు
న్యాయవాదులు, భద్రాచలం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
శుక్రవారం | సెప్టెంబర్ 01, 2023 | www.navatelangana.com

ఆడపడుచులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-మల్హర్ రావు

మంథని నియోజకవర్గంలోని ఆడప డుచులకు అండగా ఉంటానని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో తొమ్మిది మండలాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు, తదితర మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల మహిళ కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌బాబును అభినందించిన మంత్రి హరీష్‌రావు



నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కాకుల మర్రి లక్ష్మీ నరసింహారావును మంత్రి హరీష్‌రావు అభినందించారు. నూతనంగా జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్ బాబు గురువారం హైదరాబాద్ ప్రగతి భవన్‌లో మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్, సత్యవతి రాథోడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో ములుగు నియోజకవర్గ నుండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం అందరూ కృషి చేయాలని మంత్రులు సూచించారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, పార్టీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

నవతెలంగాణ-రేగొండ

గోరికొత్తపెల్లి మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. గోరుకొత్తపల్లి మండల కేంద్రంలో రాచర్ల కుమారస్వామి, బోడకుంట్ల రామకష్ణ, నెల్లి శాంతమ్మ జగ్గయ్యపేట గ్రామానికి చెందినఅల్లూరి సమ్మయ్య ల కుటుంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మటిక సంతోష్, ఎంపీటీసీ హమీద్, జగ్గయ్యపేట సర్పంచ్ పాత పెల్లి సంతోష్ నాయకులు వీరేశం మోహన్ రావు రాజు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పరామర్శ

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని దుంపలగూడెం గ్రామంలో గురువారం పలువురు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. లక్నవరం పంచాయతీ దుంపలగూడెం గ్రామంలో మేకల మల్లయ్య , బొబ్బ మల్లారెడ్డి మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందజేసి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి సూదిరెడ్డి జనార్ధన్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు బొల్లు కుమార్, ఉపసర్పంచ్ కట్ల జనార్ధన్ రెడ్డి, నన్నె బోయిన సోమయ్య, బద్దం వెంకన్న తదితర నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పరామర్శ.. ఆర్థికసాయం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహాదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన పీక మల్లయ్య, గోసిక సమ్మయ్య రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందారు. గురువారం బాధిత కుటుంబాలను బొమ్మాపూర్ బీఆర్ఎస్ పార్టీనాయకులు సర్పంచ్ ఓడేటి పద్మరవీందర్‌రెడ్డి పరామర్శించి 25 కిలోల బియ్యం, 3 వేల రూపాయల నగదు అందజేశారు. బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణ-మంగపేట

అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్)ను గురువారం మండల ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా తమ సోదరులకు రాఖీ కట్టడం కోసం పుట్టింటికి వచ్చిన ఆడపడుచులతో మండలంలో ఏ ఇంట చూసినా సందడి వాతావరణం నెలకొంది.

బీఎంఎస్ ఆధ్వర్యంలో ...

భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) బిల్ట్ ప్రధాన కార్యదర్శి రామిడి సురేష్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కమలాపురంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిల్ట్ ఫ్యాక్టరీ గేట్ వద్ద కార్మికులకు బీఎంఎస్ నాయకులు రాఖీలు కట్టారు. అనంతరం బిల్ట్ కంపెనీ సమీపంలోని పెట్రోల్ బంకు నుండి ఆటో స్టాండ్ వరకు వ్యాపారస్తులకు, బాటసారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ బిల్ట్ ప్రధాన కార్యదర్శి రామిడి సురేష్, సీనియర్ కార్యకర్త గోలి వెంకట్రామనర్సయ్య, ఇనుముల జనార్దన్‌రెడ్డి, బోనగిరి యాదగిరి, ఆముదాల లచ్చి రెడ్డి, చింతం శ్రీను, గోగుల రాంబాబు, సిహెచ్ సుదర్శన్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు భరోసా కల్పించే లక్ష్యంగా పనిచేస్తున్నాం

మహిళలు మౌనం వీడి నిర్భయంగా ముందుకు రావాలి

ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం : జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లాలో షీటీమ్స్‌తో మహిళలు, బాలికలు, విద్యార్థినిలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ములుగు షీటీమ్స్ ఆగస్ట్ లో ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల వివరాలను గురువారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ముగ్గురు ఈవ్‌టీజర్సని పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చామని ముగ్గురిపై ఈ పెట్టి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మహిళల భద్రతకు జిల్లావ్యాప్తంగా 27 హాట్‌స్పాట్‌లు గుర్తించి 60 సార్లు షటీమ్స్ బృందాలు సందర్శించి 21 సార్లు అవగాహన కార్యాక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. జిల్లా షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలు, పాఠశాలు, తెలంగాణ మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో కేజీబీవీల్లో విద్యార్థులకు ర్యాగింగ్, ఈవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. షీ టీమ్స్ నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తాయని తెలిపారు. ఆన్లైన్ ద్వారా ఎక్కడి నుండైనా ఫిర్యాదు చేసేందుకు ఈ షీటీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ స్కానింగ్ పోస్టర్స్ ను జిల్లాలో బస్‌లలో, బస్‌స్టాండ్‌లలో, సినిమాహాల్స, స్కూల్స్, కళాశాలలు, ఇతర ముఖ్యమైన రద్దీ ప్రాంతాలలో అతికించినట్టు తెలిపారు. జిల్లాలో ఎవరైనా బాధిత మహిళలు ఉంటే ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఇందుకు మొబైల్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్ కలిగి ఉండాలని, దాంతో పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే https://qr.tspolice.gov.in లింక్ వస్తుందన్నారు. దానిపై క్లిక్ చేయగానే ఫిర్యాదు ఫోరం ఓపెన్ అవుతుందన్నారు. అందులోని పేరు, లొకేషన్ తదితర వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేస్తే ఫిర్యాదు నమోదవుతుందని అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆన్లైన్‌లో వచ్చే ఫిర్యాదులను స్వీకరించి తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని అన్నారు. ఫిర్యాదు చేసిన భాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు ఫోన్ చేసి పోలీస్ సహాయం పొందాలని సూచించారు. షీ టీమ్ ములుగు జిల్లా ఫేస్ బుక్, మెయిల్ sheteammulugudistrict@gmail.com) ద్వారా ఫిర్యాదు చేసినా స్వీకరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండకుండానే బాలికలకు వివాహం చేస్తున్నట్టు తెలిసే 1098కు తెలియజేయాలని అన్నారు. ములుగు జిల్లాలో యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రారంభించినట్టు తెలిపారు. మనుషుల అక్రమ రవాణా జరిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో షీటీమ్స్ బృందాలు పనిచేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట షీటీమ్ సిబ్బంది సీఐ పి దయాకర్, ఎస్ఐ మౌనిక, కానిస్టేబుళ్లు మధు, అలేఖ్యచైతన్య, సింధు ఉన్నారు.

అందరికి రక్షా బంధన్ శుభాకాంక్షలు : జెడ్పీ చైర్‌పర్సన్





నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహదేవపూర్ మండలల కేంద్రంలో గురువారం రక్షాబంధన్ సందర్భంగా భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి-రాకేష్ బీఆర్ఎస్ మహాదేవపూర్ మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీమ్ ఖాన్, మహాదేవపూర్ ఉపసర్పంచ్ ఎండీ సల్మాన్‌ఖాన్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ శ్రీపతిబాపు, ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, గులాబీ సోదరులకు మహిళా నేతలు అన్నమనేని అరుణ,కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసి కట్టుగా మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధు, మళ్ళీ మహాదేవపూర్ సర్పంచ్‌గా శ్రీపతిబాపు విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సర్పంచ్ శ్రీపతిబాపు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, భరాస యూత్ మండల అధ్యక్షులు అలీం ఖాన్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు కారెంగుల బాపురావు, సీనియర్ మండల నాయకులు కారెంగుల బాపురావు, కూరతోట శ్రీహరి, మాజీ ఎంపీటీసీ చిల్ల కుమార్, నాయకులు కడారి రమేష్, చింతకుంట్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో..

మహాదేవపూర్ మండలంలోని శ్రీకాళేశ్వరం ముక్తేశ్వర దేవస్థానంలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాలేశ్వరం ధర్మకర్త ఓడేటి పద్మ, దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎస్ మహేష్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామెడీ రామ్‌రెడ్డి, బండి రాజయ్య, శ్యాంసుందర్ దేవుడా ప్రశాంత్‌రెడ్డి, కలికోట దేవేందర్‌లకు, దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, రికార్డు అసిస్టెంట్ దూది శ్రీనివాస్‌కు రాఖీలు కట్టి ఆశీర్వదించారు.

కాళేశ్వరం గోదావరికి హారతి పూజలు



దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి రోజున గోదావరి నదీ హారతి కార్యక్రమం నిర్వహించుటకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా గురువారం శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం కాలేశ్వరంలో గోదావరి నది వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.మహేష్, ఆలయ ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడీ రామ్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ దేవ్డా ప్రశాంత్‌రెడ్డి, కలికోట దేవేందర్, ఓడేటి పద్మ బండి రాజయ్య అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు భక్తులు మహిళలు పాల్గొన్నారు.

'విశ్వదీప్తి' పాఠశాలలో....



నవతెలంగాణ-మల్హర్‌రావు

రాఖీ పౌర్ణమి సందర్భంగా తాడిచెర్లతోపాటు అన్ని గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొయ్యూర్ లోని విశ్వదీప్తి ప్రయివేటు పాఠశాలలలో కరస్పాండెంట్ సుదర్శన్ ఆధ్వర్యంలో చిన్నారులు ఒక్కరికొక్కరు రాఖీ కట్టి రక్షాబంధన్ సంబరాలు నిర్వహించారు.

ఆప్యాయతానురాగాలకు ప్రతీక... రాఖీ పండుగ

జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి



నవతెలంగాణ-ములుగు

ఆప్యాయతలకు అనురాగాలకు సూచికగా రాఖీ పండుగ నిలుస్తుందని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. గురువారం కళాశాలలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో అనేక కులాలు, మతాల వారు ఉన్నారని, దేశ సంస్కృతీ, సాంప్రదాయాలతో అనేక పండుగలు జరుపుకుంటామన్నారు. అలాంటి వాటిలో రాఖీ పండుగ ఒకటని అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ ఉపాధ్యాయులు కే సురేష్ బాబు,ఆర్ సత్యం, ఫిజికల్ డైరెక్టర్ వి రవి, జె. శ్రీధర్ రావు, డాక్టర్ ఆంజనేయులు,ఎం రాజేందర్, శంకర్, మహేష్ మొదలైన వారు పాల్గొన్నారు.



అనుబంధాలను గుర్తు చేసేదే రక్షా బంధన్

నవతెలంగాణ-ములుగు

ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలను రాఖీ పండుగ తెలియజేస్తుందని, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ములుగు జిల్లాలోని పలువురికి సంప్రదాయ పద్ధతిలో బొట్టు పెట్టి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ లో విద్యార్థులకు తస్లీమా బొట్టు పెట్టి రాఖీ కట్టి ఆశీర్వదించారు. యువకులకు, వ్యాపారస్తులకు రాఖీ కట్టారు. రాఖీ పండుగకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని తస్లీమా అన్నారు.



ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-గోవిందరావుపేట

రాఖీ పండగ సందర్భంగా మహిళా లోకానికి కానుకగా గ్యాస్ ధర తగ్గించినందుకు మండల కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మద్దినేని తేజరాజు, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి కర్ర సాంబశివారెడ్డి మెరుగు సత్యనారాయణ, అంతి రెడ్డి సత్యనారాయణ రెడ్డి,మూల కుమార్, రాజ్ భార్గవ్ వలపదాసు విశంకర్, చందజ్యోతి, అంతి రెడ్డి రమాదేవి, దావుల స్వప్న, రాజారపు రామచంద్రు, లలిత, ఈక జగ్గారావు, బద్దం జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో అక్రమ కట్టడాలు నిలిపేయాలి : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-కాటారం

కాటారం మండలం లోని గంగారాం ఎక్స్ రోడ్డు పై ప్రభుత్వం దళితులకు పంపిణీ చేసిన భూములను బలవంతం గా లాక్కుని చేపడుతున్న అక్రమ కట్టడాలని నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి ప్రకటనలో పేర్కొన్నారు. గంగారాం ఎక్స్ రోడ్డు వద్ద సర్వే నంబర్లు 181/3,176,132లో గతంలో ప్రభుత్వం దళితుల కోసం భూమిని కేటాయించగా సదరు భూములని అగ్రవర్ణ భూస్వాములు లాక్కుని అక్రమ కట్టడాలు చేపడుతున్నట్లు ఆరోపించారు. సంబంధిత అధికారులు, అగ్రవర్ణ భూస్వాముల పరస్పర సహకారం తోనే అసైండ్ భూముల్లో ధర్జాగా కట్టాడాలు నిర్మిస్తున్నారాని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలు నిలిపివేసి దళితులకు భూములు అప్పగించాలని లేనిపక్షం లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

నేటి మండల బంద్‌కు సహకరించాలి

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

రెవెన్యూ డివిజన్ సాధనలో భాగంగా గురువారం సాయంత్రం మహాదేవ్‌పూర్ డివిజన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సబ్బండ కులాల నిర్ణయం మేరకు వచ్చే సోమవారం మహదేవపూర్ మండల బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. మండల వాసులు వ్యాపారవేత్తలు, విద్యా సంస్థలు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలని రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ పిలుపునిచ్చింది.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేనా... ?



నవతెలంగాణ-వాజేడు

పథకం ఏదైనా లబ్దిదారుల ఎంపిక దళారుల చేతిలోనే అన్న చందంగా మారుతోంది. పేరుకే ప్రభుత్వ పథకాలు ఆచరణలో మాత్రం అధికార పార్టీల కార్యకర్తలకు మాత్రమే వర్తిస్తున్నాయి. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీల దళారుల ఆగ డాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సంక్షేమ పథకాలలో దళారీ వ్యవస్థ అరికట్టాల్సిన అధికారులే వారి నుంచి వాటాలు తీసుకుని పేదలకు దక్కాల్సిన సొమ్మును దోచుకుంటున్న దుస్థితి నెలకొంది. మొన్న దళిత బంధు, నేడు బీసీబందులోనూ అధికార పార్టీలకు చెందిన దళారులు గద్దల్లా వాలీ అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపణ లొస్తున్నాయి. ఇందుకు వాజేడు మండలమే నిదర్శనం.

మండలంలో దళారులు ఎంపిక చేసిన పేర్లకు మాత్ర మే సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని, బీసీబంధులో ఎంపికకు ఒక్కొక్కరి నుండి దళారులు రూ.10వేలు వసూలు చేసినట్లు సమాచారం. అర్హత లేకున్న పది వేలు ఇస్తే బంధు వస్తుందని బాహటంగా ప్రచారం జరుగుతోంది. నిజమైన చేతివృత్తిదారులకు పథకం వర్తించలేదని ఆరో పణలు వెలువెత్తుతున్నాయి. బీసీబంధులో చెక్కులు పంపిణీ చేసేవరకు లబ్దిదారుల ఎంపిక లిస్టు అధికారులు బహిర్గతం చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లబ్దిదారులు ఎంపికలో డబ్బు ప్రభావం, అధికార పార్టీ నాయకుల ప్రమేయం నడిచిందని లబ్దిదారులు, పలు ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల్లో అర్హులను ఎంపిక చేసి లబ్ది చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.